# భాగవత సూక్తము



2

మాస్టర్ పార్వతీకుమార్



"నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ముఁ పురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ! మేటిపె
ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరిం బతిఁ జేయు మమ్మ నిన్
నమ్మినవారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ! యీశ్వరీ!"

(అమ్మగారు శ్రీమతి కృష్ణకుమారిగారి
71వ జయంతి సందర్భమున సమర్పితము.)

# భాగవత సూక్తము

(మాస్టర్ పార్వతీకుమార్‌గారి భాగవత ప్రవచనముల నుండి)

2

**మాస్టర్ పార్వతీకుమార్**

**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణ : 22-07-2021 ప్రతులు : 1,000
(మాతృశ్రీ కంభంపాటి కృష్ణకుమారిగారి 71వ జయంతి)

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

వెల : **రూ. 80-00**

ప్రతులకు :
**ధనిష్ఠ ఫౌండేషన్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002
ఫోన్ : 0891-2701531, 2509154,
website : www.dhanistha.org.
info@dhanistha.org
ISBN : 978-81-89467-98-2

ముద్రణ :
**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**
విశాఖపట్నం-530 016.
ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

"**ధనిష్ఠ**" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్చుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"**ధనిష్ఠ**" మాస్టర్ పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"**ధనిష్ఠ**" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్చుచున్నది.

# భాగవత సూక్తము

భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు... అను విషయమును పరిపూర్ణముగా, అనుభవపూర్వకముగా తెలిసినవారు మాస్టర్ పార్వతీకుమార్‌గారు.

చిన్ననాటి నుండి భాగవత స్పర్శా స్ఫూర్తి కలిగిన పుణ్యజీవి. వారి జీవిత పరమార్థముగూడ భాగవత జీవనమే అన్నట్లుగా, మాస్టర్ ఇ.కె.గారు కూడ దశాబ్దముల క్రిందట ''భాగవత దర్శనము'' వారి ప్రవచన విషయముగా సూచించి నిర్ణయించుట మరియు మాస్టర్ ఇ.కె. గారి భాగవత రహస్య ప్రకాశ వివరణా ప్రణాళిక వీరి ద్వారా నిర్వర్తింపబడుట మొదలగున వన్నియు ప్రస్తుత భాగవత ప్రవచనా యజ్ఞమునకు నాందిగా కనిపించును.

మాస్టర్ పార్వతీకుమార్ గారు మాస్టర్ ఇ.కె. విరచిత రహస్య ప్రకాశము సమగ్రముగ అవగాహన చేసుకొనినవారు. ఆ ప్రాతిపదికను ఉపాధిగా శ్రీమద్భాగవత ప్రవచనమును ఒక యజ్ఞముగా స్వీకరించి, తనను తాను ఉద్ధరించుకొనుట కొరకు

ఈ ప్రవచనములని, ఆసక్తి కలవారు పాల్గొనవచ్చునని సాధకులకు సూచన చేసి మరీ ప్రారంభించుట విశేషము.

ఈ ప్రవచన యజ్ఞము జనరంజకమై అత్యంత విశేష, సాధనాపరమైన రహస్యములతో వేలాదిమందికి (అనువాదముతో విదేశీయులు సహితము) కరదీపికయై, నిత్య యోగజీవన సాధనగా వ్యాప్తి చెందుట భగవంతుని అనుగ్రహము.

ఈ యజ్ఞమునకు ఆకర్షితులైన **శ్రీమతి కె. సుజాత, నవగోపికా సంఘము, భాగ్యనగరం బృందము** అత్యంత శ్రద్ధాభక్తులతో ఈ ప్రవచనములను లిఖించి, వేలాదిమందికి అందజేయుట వారి భక్తికి నిదర్శనం. ప్రతిదినము ప్రభాతమున ఈ ఉపదేశములు ''రాధామాధవమ్'' వాట్సాప్ గ్రూప్ నందు సాధకులకు దర్శనమిచ్చును.

ఈ పవిత్ర యజ్ఞమునకు ఆకర్షితులైన **శ్రీమతి లతారాణిగారు** (భాగ్యనగరము) అమ్మగారు *''శ్రీమతి కృష్ణకుమారిగారి జయంతి''* సందర్భముగా బృందమునకు అందజేయు శుభ సంకల్పము చేసిరి. ఈ యజ్ఞములో పాల్గొన్న వారందరికీ మాస్టరుగారి శుభాశీస్సులు! మాస్టరుగారి నుండి వెలువడిన ఈ పవిత్రమైన యజ్ఞము భగవదర్పితము.

తేది : 22-07-2021

**ధనిష్ఠ**



# భాగవత సూక్తము

# 1

భాగవతము ప్రారంభంలోనే "శ్రీకైవల్యపదంబు చేరుటకునై" అని ఉన్నది. శ్రీకైవల్యపదం అంటే శుభప్రదము, లక్ష్మీప్రదము, విద్యాప్రదము, శక్తి ప్రదము. 'శ్రీ' అంటే పార్వతి, లక్ష్మి, సరస్వతి. ఈ మూడింటికి మూలము శ్రీకైవల్య పదము. మన లోపల, బయట వ్యాప్తి చెందినటువంటి దైవముతో మనము చేరడానికి చేసే ప్రయత్నమే భాగవత పఠనము. మూలమైన తత్త్వములోకి చేరడానికి నిజమైన ప్రయత్నము ఉంటే భాగవత మార్గములోనికి ప్రవేశించినట్లు లెక్క. ఆ మూలమునకు దారి చూపువాడే సద్గురువు.

# 2

భాగవత పారాయణము, సత్సాంగత్యము, పుణ్య శ్రవణ కీర్తనుడైన భగవంతుని యొక్క లీలలను వినే అవకాశము కాలము ఏర్పరచాలంటే మన ప్రారబ్ధకర్మలు కొంత ఉపశమించాలి. శరీరము ధరించినందుకు మనిషికి అనేకమైనటువంటి నిత్య కర్మలుంటాయి. ఇన్నిటి నుంచి మనము కడతేరి ఒక దివ్యస్మరణకు చేరుకోగలగడం అనేది ఒక అదృష్టము. ఈ దివ్య స్మరణము మన ప్రజ్ఞకు ఊర్ధ్వగతిని కలిగిస్తుంది. ఇక మిగతావేవీ కలిగించవు. అందుచేత ఒక సత్పురుష సమాగమముకాని, ఒక సంశ్రవణము గాని, జీవుడు కోరుకుంటే జీవుడు ఉన్న స్థితి నుంచి ఉద్ధరింపబడతాడు.

# 3

ఆదివారము అన్ని వారాలలో కెల్ల ప్రధానమైనది, పవిత్రమైనది, వజ్ర సమానమైనది. ఆదివారము ఉదయమున సూర్యప్రజ్ఞ ఎక్కువగా ఉంటుంది. సూర్యుడు ఆత్మకారకుడు, ఆరోగ్యకారకుడు. సూర్యుడి శబ్దము 'ఓం'. ఆదివారం సాయంత్ర సమయము గూడ అత్యంత ప్రధానమైనది. ఎందుకంటే సాయం సమయములో అశ్వినీ దేవతల అనుగ్రహము ఉంటుంది. రుద్రుల అనుగ్రహము ఉంటుంది. ఆదివారం సాయంత్రము 6 గంటలకు గురుహోర ఉంటుంది. గురువు అంటే ప్రజ్ఞకి వ్యాప్తి నిచ్చేవాడు. గురువు శబ్దము 'గ'. గ+ఉ = గో. ఈ శబ్దాలను అత్యంత పవిత్ర శబ్దాలుగా చెప్తారు. మనకి ఎన్ని కార్యక్రమములున్నా, ఆదివారం సాయంత్రము పవిత్రమైన కార్యక్రమములో ప్రవేశించాలి. ఆ కార్యక్రమమే భాగవతము. ఉభయ సంధ్యలను ఈ విధముగా ఆదివారం నాడు సద్వినియోగము చేసుకుంటే ఉత్త మానవులము ఉత్తమ మానవులము అవుతాము.

# 4

భాగవతము వినడం ఒక పూర్వపుణ్య విశేషము. విన్నదాని యందు బాగా రుచి కలగడం మరింత పుణ్యవిశేషము. మనలో నర నరములలో జీర్ణించుకు పోవడం అనేది పెద్దలు మన నుంచి కోరే ఒక సాధన. భాగవతము మధురభక్తితో కూడినది. వింటున్నపుడు అప్పటికప్పుడు స్ఫూర్తి నిస్తుంది. ఇచ్చిన స్ఫూర్తి ఇగిరి పోకుండా ఉండాలంటే మనము మధ్య మధ్యలో మననము చేసుకోవాలి. అలా కాకపోతే స్థిరపడదు. అలా ఊరికే పై పొరవలె ఉంటుంది. ఆకళింపు కాకపోతే మనకు తెలుసు అను ఒక భావన యందుంటుంది. భాగవతము మనలో ఇంకాలని పరమగురువులు మధ్య మధ్యలో యిలా హెచ్చరిస్తూ ఉంటారు.

# 5

నారదుడు సృష్టి మొత్తమునకు గురుత్వము వహించిన మహర్షి. ఎందుకంటే అసలు రహస్యమును హృదయమునకు అంటుకొనేటట్లుగా మనకు ఒక తాళం చెవి ఇస్తాడు. నారదుడు విష్ణువు యొక్క అవతారమే. భగవంతుని గురించి తెలుసుకొనే ఆరాటము, తపన, ప్రజ్ఞ కలిగితే మనలో నారదుడు అవతరిస్తాడు. ఆయన జీవులకు విష్ణుతంత్రమును ప్రసాదించి, కర్మబంధములను తొలగిస్తాడు. తంత్రము అనగా అల్లిక. భాగవత విద్యయే విష్ణుతంత్రము. కనుకనే వ్యాసమహర్షికి నారదుడు భాగవతమును ఉపదేశము చేశాడు.

# 6

కృష్ణుని ఆరాధనమే మధురం. కృష్ణుని గురించిన భావనయే మధురం. కృష్ణుని చేష్టలు మధురము. కృష్ణుడు నచ్చుడానికి చాలా సంస్కారముండాలి. అది ఉండబట్టే మునులందరూ వెయ్యి సంవత్సరములు కృష్ణ స్మరణలోనే ఉండి, ఆయన కథలు, లీలలు వినడానికి జీవితాన్ని ప్రధానంగా సమర్పణ చేసుకున్నారు. దినచర్య అంతా యాంత్రికము అయినది. విష్ణు కథలు వినడమే మన జీవ ప్రజ్ఞకు ఆహారము అని భావించారు. మన దృక్పథము దివ్యత్వము వైపు, మధుర భక్తి వైపు మళ్లిస్తే మధుర జీవనము ఒకటి ఏర్పడుతుంది.

# 7

సనకసనందనాదులు, సప్తఋషులు, ద్వాదశ ఆదిత్యులు, ఏకాదశ రుద్రులు, అష్ట వసువులు వీరందరూ భగవంతుని యొక్క సృష్టి సైన్యము. వీరు సృష్టిని పోషిస్తూ, రక్షిస్తూ, ఉద్ధరిస్తూ ఉంటారు. దైవముతో కూడివుండి దైవమును మరువక, దివ్యకర్మను చేస్తూ ఉంటారు. దివ్యకర్మలో భాగముగా జీవులను తీసుకొచ్చి దివ్యకర్మ చేస్తూ జీవిస్తూ ఉంటే ఏమీ అంటదు అని చెప్తారు. కానీ యజ్ఞార్థకర్మ (పరహితము) చేయకుండా జీవుడి వాసనలు అడ్డు తగులుతూ ఉంటాయి. ఎక్కడ యజ్ఞార్థముగా కార్యము జరుగుతూ ఉంటుందో అక్కడ వృద్ధి ఉంటుంది. అది సృష్టి ధర్మము. అది చెప్పడానికే సద్గురువులు దిగివచ్చి ముక్తికి దారి చూపిస్తారు.

## 8

శుకయోగి ప్రజ్ఞ అంటే వేదవ్యాస ప్రజ్ఞను మించిన ప్రజ్ఞ. శుకయోగి భావమయ లోకములో ఉండడు. భగవంతునితోనే ఎప్పుడూ కూడివుండి, భగవద్భావన తప్ప మరొకటి లేక (తానున్నాననే భావన కూడ లేక) ఉండువాడు శుకయోగి. అదీ నగ్నత్వం అంటే. తనకి కూడ అందనంత అనుస్యూతమైన అనుభూతి శుకయోగికి కలిగినదని వేదవ్యాసుడే భాగవత ప్రథమ స్కంధములో రచించాడు. అందుచేత శుకయోగి భాగవతమును బోధించడము జరిగినది.

# 9

దైవము అంటే ఈ సమస్త సృష్టికి ఆధారమైనటువంటి సత్యము, చైతన్యము. ఈ ఏర్పడినటువంటి దైవాన్ని ఎన్ని నామాలతో అయినా పిలుచుకోవచ్చు. ఎన్ని రూపాలతో అయినా కొలుచుకోవచ్చు. అన్ని రూపములకు ఆధారము చైతన్యము. ఆ చైతన్యమునకు ఆధారము సత్యము. సత్యమును మన ఋషులు పరతత్త్వమన్నారు. చైతన్యమును అమ్మవారు అంటారు. ఈ సత్యమును, చైతన్యమును అన్నింటిలో చూస్తూ ఉంటే మనం పరీక్షిత్తుల మవుతాము. అన్నింటిలో దైవమును పరీక్షగా చూసేవాడు పరీక్షిత్తు.

# 10

మనలో ఉన్న ఈశ్వరునికి దారి చూపేవాడే సద్గురువు. గురువు దగ్గర ఉన్నంత మాత్రాన ఏమీ రాదు. గురుతత్త్వము తెలియాలి. మొత్తమంతా నిండివున్న తత్త్వము గురుతత్త్వము. అదే పరతత్త్వము. అలాంటి తత్త్వము గురువు నుండే వ్యక్తమౌతుంది. గురువు పరతత్త్వ స్పర్శను అందివ్వడానికే ఉంటాడు. ఆ పరతత్త్వము, గురుతత్త్వము ధర్మానికి బద్ధుడై జీవించేటటువంటి ఒక వ్యక్తిని ఆశ్రయించి ఉంటుంది. ఆ రూపము ద్వారా మనకి అందుతుంది. గురు రూపాన్ని గౌరవించి, గురుతత్త్వాన్ని ఆశ్రయించాలి.

# 11

బృహస్పతి శబ్దానికి సంకేతము. సద్గురువు కూడ మంత్రమును శబ్దము లాగా యిస్తారు. ఆ శబ్దాన్ని అనుసరిస్తే ఆ శబ్దతరంగాలు మన శరీరంలోని అన్ని భాగాలలో చేయవలసిన మార్పులు చేస్తాయి. ఊర్ధ్వము నుంచి అధస్సు వరకు సమస్తము చక్కగా అనుసంధానం చేయబడుతుంది. అనగా ఒక పరమగురువు సహస్రారము నుండి దివ్యప్రణాళికను అందుకుంటూ, ఆజ్ఞ యందు దాని యొక్క మార్గదర్శకత్వమును పొంది, అటుపైన హృదయము నందు నిక్షిప్తము చేసుకొని కంఠము నుండి వ్యక్తము చేస్తూ, మిగిలిన మూడు కేంద్రముల ద్వారా నిర్వర్తిస్తూ ఉంటాడు. బృహస్పతి, సద్గురువు ఏడు కేంద్రముల నుంచి పనిచేస్తూ ఉంటారు. అపుడే ఏడు తంతువుల వీణ మనలో చక్కగా పనిచేస్తుంది.

## 12

మంచిపని చెయ్యాలనే ఉద్దేశ్యము ఉంటుంది గాని, చెయ్యడానికి కావలసిన ధైర్యము ఉండదు. ఒక మంచిపని మనలను రక్షిస్తుంది. జీవుడిగా మనము బాగుపడి, ఉద్ధరింపబడతాము అనే నమ్మకము ఉన్నవాడు దూకేస్తాడు. "To Dare, To Will, To Serve and to be Silent" అని పరమగురువులు చెపుతారు. ఎక్కువ చేసి 'ఏమీ మాట్లాడకపోవడం ముఖ్యము. సంకల్పము ఉండి, ధైర్యం లేక జీవించువారిపై, ఆకస్మికముగా తోడేలు దుమికి జంతువును పట్టినట్లు కలి పట్టేస్తాడు. ఆచరణలోకి ఇంకా వీడు దిగలేదని. కలికి పట్టడము చాలా సులభము. పొరపాటు చేయువారి గురించే కలిపురుషుడు వేచి ఉంటాడు.

# 13

సృష్టికి ఆవల ఉన్న తత్త్వమును ఆరాధించడానికి ‘స’ ‘హ’ ‘స’ అనే మంత్రము ఉన్నది. ‘స’ అనే అక్షరము పురుష తత్త్వానికి, ‘హ’ అనే అక్షరము ప్రకృతి తత్త్వానికి, మళ్లీ ‘స’ అక్షరములో, సృష్టిని ప్రారంభము చేసి, అందు నుంచి హరియై దిగివచ్చే తత్త్వము ఇమిడి ఉన్నది. శిరస్సు నందు ఈ మూడు అక్షరములతో కూడిన తత్త్వము పరిపూర్ణముగా ఉన్నది. సృష్టికి ఆవల ఉన్న తత్త్వం ప్రకృతి–పురుషులుగా ఈవలకు ఎలా దిగివచ్చినది అనే సమస్త జ్ఞానము సహస్రారము చేరుకున్న వారికి బాగా అవగతమవుతుంది. ఎవరైనా దైవాన్ని చేరుకోవడం అంటే సహస్రారాన్ని చేరుకోవడమే. యోగములో గూడ అది అత్యుత్తమ స్థానముగా చెపుతారు.

# 14

మొదట సృష్టిలో ఈశ్వరతత్త్వము, ప్రకృతి వచ్చాయి. వాటి ఆధారముగా మూడు గుణములు ఏర్పడ్డాయి. వీటి నుంచి దిగివచ్చినవాడు జీవుడు. త్రిగుణముల నుంచి పుట్టినవాడికి నేను, నాది అన్న భావన వస్తుంది. కానీ నా మూలము ఈశ్వర తత్త్వమే అని గుర్తున్నవాడి నుంచి దైవకార్యములు సాగిపోతూ ఉంటాయి. త్రిగుణముల దగ్గర ఉన్న పట్టును దాటేస్తే భాగవతమూర్తులు అవుతారు. అంటే కార్య కారణ లోకాలలో ఉంటారు.

# 15

సృష్టి చూడడానికి చాలా అద్భుతముగా కనిపిస్తుంది గాని, కర్తవ్యము మరచిన వాడికి అది పెద్ద ఊబి అయిపోతుంది. నిష్కామకర్మము మరచిపోయినప్పుడు ఇరుక్కోవడము తథ్యము. నిష్కామ కర్మ చేసేవాడు గూడ కొంత దూరం వెళ్లిన తరువాత అహంకారము కలిగిందంటే పడిపోతాడు. అందుకని దైవారాధన చేసుకుంటూ, తండ్రీ ఎప్పుడు పడిపోతానో తెలియదు. నన్ను కొంచెము చూసుకుంటూ ఉండు అని చెప్పుకోవడం భాగవత మార్గము.

## 16

కృష్ణుడు అంటే అంతర్యామి దైవమే అని ప్రధానముగా గుర్తుండాలి. అపుడే అందరిలో దైవమును చూసే వికాసము ఏర్పడుతుంది. జీవుడు ఏ రకముగా ప్రవర్తించినా నీ వరకు అంతర్యామి దైవముతో సంబంధము ఏర్పరచుకుంటే అంతర్యామి నీ యందు అవతరిస్తాడు. అతడు అవతరించి నీ ద్వారా అన్ని పనులు నిర్వర్తిస్తాడు. నీ ద్వారా మాట్లాడుతూ, స్పర్శనిస్తూ ఉంటాడు. అంతర్యామి దైవమును పరిచయం చేసుకోవడమే జ్ఞానానికి ప్రధానమైన మెట్టు.

## 17

కర్తవ్యాన్ని మరచిపోయిన వాడికి మాయ క్రమ్ముతుంది. కర్తవ్యాన్ని కాలము నిర్దేశిస్తూ ఉంటుంది. 'కర్తవ్యము రూపములో నేనున్నాను నీతో' అని దైవము చెప్తాడు. దేవుడన్నా, కర్తవ్యమన్నా ఒకటే. మన జన్మ కారణమేమిటో తెలుసుకొని దానిని నిర్వర్తించుకొనే కార్యక్రమములో మనముంటే సూటిగా మన కర్తవ్యమేమిటో చెపుతాడు. నేను రోజూ నా కర్తవ్యములో నడుస్తున్నానా లేదా అని ప్రశ్నించుకొని కర్తవ్యానికి దూరమైతే ప్రార్థన పెంచాలి. మేము మాయలో పడడము ఖాయం, నువ్వే మమ్మల్ని రక్షించు అని దైవమును ప్రార్థన చేయాలి. లేకపోతే మాయ కమ్మి బంధింపబడతాము.

# 18

ఉత్తరమనే దిక్కు చాలా నిశ్శబ్దముగా ఉంటుంది. ఉత్తరమనే దిక్కు నుంచి తూర్పు, పడమరలు ఏక కాలములో ఏర్పడతాయి. తూర్పు అంటే పురుషుడు, పడమర అంటే ప్రకృతి. పురుషుడు, ప్రకృతి ఏక కాలములో ఏర్పడతారు. కాని ఉత్తరము కనబడక పోవడము వలన మనము తూర్పే ప్రధానముగా భావిస్తాము. ఉత్తరము యొక్క వ్యక్తరూపమే దక్షిణము. శిఖను ఉత్తరదిక్కు అంటారు. తూర్పు దిక్కు మన పాలభాగము. పడమర దిక్కు మన మూలాధారము. దక్షిణము మన హృదయము. హృదయము నుండి సూటియైన ఒక దారి శిఖకు ఉన్నది. హృదయములో ఉండేవారికి శిఖ చేరడము పెద్ద విషయము కాదు.

## 19

జీవుడు దేవునితో జోడింపబడడాన్ని భక్తి అంటారు. ఎప్పుడూ అతుక్కుపోయి ఉంటే అది అనన్య భక్తి. మనము భయము వేసినపుడు అతుక్కుంటాము. భయము లేని సన్నివేశాలప్పుడు కూడ అంతర్యామిని దర్శించడం అనే ప్రయత్నము ఒక ప్రక్క సాగుతూ ఉండాలి. నెమ్మదిగా అది పేనుతూ ఉండాలి. ఎప్పుడో అవసరంలో పేనుదాము అనుకుంటే అవదు. ఆపద వచ్చినది కాబట్టి భక్తిగా ఉంటానంటే కుదరదు. అవసర భక్తి, భక్తి కాదు. నిరంతర భక్తే భక్తి.

## 20

నాకంతా తెలుసు అనేవాడు తెలియని వాడని చెపుతుంది భాగవతము. నాకు తెలియదు అని చెప్పేవాడు కూడ తెలియనివాడే అని చెపుతుంది. ఇక్కడ మనలను గూర్చిన భావన ఉన్నది. తనను గురించి తనకు గుర్తు లేనివాడు, తనకు తెలుసునని కూడ తెలియనివాడు నిజమైన తెలిసినవాడు. తనకు తెలుసునని తెలియని స్థితిలో ఉన్న వాడిలో నుంచి దైవమే పలుకుతాడు. అలా పలికితే వచ్చినదే కదా భాగవతము. తెలిసి పలుకుదామని పోతన అనుకోలేదు.

# 21

భగవంతుడు అనుగ్రహించ దలచుకుంటే ఎవరినైనా అనుగ్రహిస్తాడు. ఎవరిని అనుగ్రహిస్తాడు, ఎవరిని అనుగ్రహించడు అనేది ఎవరూ చెప్పలేరు. జీవుడిలో మనము చూడలేనిది, అతడు చూడగలిగేదీ ఒకటి ఉంటుంది. పదిమంది కొరకు పాటుపడే దివ్యగుణము కలిగిన వారంటే ఆయనకు చాలా ఇష్టము. నీ చుట్టూ ఉన్న జీవరాసుల ఎడల నీవు ఎలా ఉన్నావు అన్నదానిని బట్టి ఆయన అనుగ్రహము ఉంటుంది. జీవుల హితము నందు ఆసక్తి నీ యందు సహజముగా ఉంటే, ఆయన కరుణ నీయందు తప్పక వర్షిస్తుంది. భగవదనుగ్రహము ఒక విచిత్రమైన విషయము. అది ఒక మహా వైభవం.

## 22

ఆత్మపరమైన విషయముల యందు ఆసక్తి కలగాలంటే ఆత్మపరమైన విషయములనే ఎక్కువ పఠిస్తూ ఉండాలి. అప్పుడది ఆత్మవిచారానికి దారితీస్తుంది. ఆత్మవిచారము జరగకపోతే మిగతావన్నీ మనకు విచారము కలిగించేవే. ఆత్మవిచారము నందు రుచి కలిగితే ఆచారము నందు అంత పట్టు ఉండదు. ఆత్మానుభూతికి, ఆత్మ సాధనకు కావలసినది అది కావాలి, ఇది కావాలి అన్న ఆసక్తి కాదు. మన మనస్సు బుద్ధిని ఆధారము చేసుకొని మన నిజస్థితి లోనికి వెళ్లడమే ఆత్మసాధన. బుద్ధిలోకి ప్రవేశించిన వాడే ఆత్మ సామ్రాజ్యము యొక్క పొలిమేరలలోకి వెడతాడు.

# 23

కృష్ణ భక్తి వేరు. అది కలిగిన వారికి ప్రపంచమంతా వేరే రకముగా ఉంటుంది. కృష్ణుడిని నమ్ముకుంటే ఎంత రాయి లాంటి హృదయమైనా సరే కరిగించి, మార్దవం కలిగించి రసానుభూతిని కలిగించేంత వరకు వదిలిపెట్టడు. శ్రీరాముడు శ్యామలాదేవి అయితే శ్రీకృష్ణుడు లలిత. కృష్ణావతారము కొన్ని వేల దృక్కోణాలు గల అవతారము. మొత్తము ప్రకృతి అంతా పులకించిన రూపము. ఎవరిని అనుగ్రహిస్తాడో, ఎందుకు అనుగ్రహిస్తాడో ఎవరూ చెప్పలేరు. అంతర్యామి దైవమే కృష్ణుడిగా వచ్చాడని భావించినవారు మైత్రేయుడు, భీష్ముడు, కుంతీదేవి.

## 24

భూలోకంలో పదార్థమునకు చాలా బలముంటుంది. మిగిలిన గోళాల్లో పదార్థానికి అంత బలము లేదు. భూగోళ పదార్థము నుంచి ప్రజ్ఞ బయటపడాలంటే దానికి మహత్తరమైనటువంటి ప్రయత్నము కావాలి. జీవుడిని పదార్థము బంధించి లక్షలాది జన్మలెత్తేటట్లుగా చేస్తుంది. భూలోకవాసము అన్నిటికన్నా ఎక్కువ కష్టమైనటువంటి వాసం అని మరువు మహర్షి చెపుతారు. ఇందులో నుంచి బయటకు రావడానికి ఎంతో ప్రయత్నము చేయాలి. మన ప్రయత్నమంతా గోరువెచ్చటి నీటిలాగా ఉంటుంది. నీరు మరిగి, ఆవిరి అయితేనే కదా స్థితి మార్పు చెందుతుంది.

## 25

సంతోషముగా ఉండడమనేది సంపద. అదే 'శ్రీ' అంటే. ఆస్తిపాస్తులున్నా సుఖము ఉండకపోవచ్చు. సంపద వలన సంతోషము కలుగదు. కొంతమంది నిష్కారణంగా ఆనందంగా, సంతోషముగా ఉంటారు. వాళ్ల సహజమైన లక్షణమే ఆనందంగా ఉండడం. 'శ్రీ' అను నామమును ఉచ్చరించుచూ, లక్ష్మీదేవిని ఆరాధించినచో సంపన్నుడుగా జీవించుటకు కావలసిన సన్మార్గ రహస్యములు ప్రసన్న మౌతాయి. మొత్తము సృష్టి అంతా శ్రీ యందే ఏర్పడుతూ ఉంటుంది.

## 26

మనకు బయట విషయముల యందు, మనము సృష్టించుకున్న విషయముల యందు పట్టు ఉంటుంది. అది బ్రహ్మ గ్రంథి. రెండవది భావమయ లోకములో పట్టు. అనగా అభిప్రాయముల మీద, సిద్ధాంతముల మీద పట్టు. ఇది విష్ణు గ్రంథి. మూడవది నేనున్నాననే పట్టు. ఇది రుద్ర గ్రంథి. ఈ మూడు పట్లు వదిలితే దేహము మీద పట్టు వదిలినట్లే.

# 27

జీవుడి యొక్క స్వస్థానము ఆజ్ఞా కేంద్రము. అక్కడికి చేరిన వాడికి మృత్యువుండదు. అనగా స్థూల దేహము, సూక్ష్మ దేహము దాటి కారణ దేహములో ఉంటాడు. కారణ దేహాన్నే లింగ శరీరము అంటారు. లింగశరీరములో చేరినటువంటి వాడికి మరణానుభూతి ఉండదు. ఎందుకంటే ఆ దేహమునకు లోపల ఉండే ఈశ్వరుడితో అనుసంధానం ఏర్పడి ఉంటుంది. మృత్యువు ఈశ్వరుడికి లేదు, అతని నుంచి దిగివచ్చిన జీవుడికీ లేదు. నిద్రలోకి వెళ్ళేటప్పుడు ఆజ్ఞా కేంద్రము నందు ఈశ్వర తత్త్వములో ఉన్నట్లుగా భావన చేసుకోవాలి.

## 28

మనము దేవాలయ ప్రాంగణము లోనికి ప్రవేశించగానే మొట్టమొదట కనిపించేది ధ్వజస్తంభము. ధ్వజస్తంభము అనగా మనలో ఉన్న వెన్నెముక. ధ్వజస్తంభమును దర్శించడమంటే మనలో ఉన్న వెన్నెముకలోని ప్రజ్ఞా కేంద్రమున గల సుషుమ్న నాడి లోనికి ప్రవేశించినట్లు. లోపలికి వెడితే దేవుని వాహనము కనిపిస్తుంది. ఆ వాహనము నంది కావచ్చు, గరుత్మంతుడు కావచ్చు. ఆ వాహనము తరువాత గడపకి అవతల దైవమే ఉంటాడు. ఈ వాహనము భగవంతుడికి అత్యంత ప్రీతిపాత్రమైన జీవుడి క్రింద లెక్క. గర్భగుడి గడప దగ్గరకు వెడితే బుద్ధి లోకాలు దాటుతాము. గర్భగుడి గడపే మన భ్రూమధ్యం. గర్భాలయం మన ఫాలభాగము. గర్భాలయంలో ఉండే ఈశ్వరునితో అనుసంధానము చేసుకుంటే మనకు బాహ్య ప్రపంచ ముండదు.

## 29

దైవము అవ్యక్తముగా ఉంటే జీవులు అర్థము చేసుకోలేరు. వ్యక్తమైన రూపాన్ని చూసినా అందులో ఉన్న దైవాన్ని చూడడము లేదు. ఇది మనకు జరిగే సర్వ సామాన్యమైన మాయ. ఒకే తత్త్వము అనేక విధములుగా రూపాంతరము చెందినపుడు మూలమైన దానిని మర్చిపోతాము. ఈ మరపునే మృత్యువు అని పెద్దలు చెపుతారు. మూలాన్ని దర్శనము చేస్తూ ఉంటే మాయ మనలను ఇబ్బంది పెట్టదు. లేనిచో మాయ మనలను అజ్ఞానము, అహంకారము, ద్వేషము లోనికి, మనము ఎప్పుడూ జీవించి ఉండే ఆకాంక్షలోనికి నెట్టివేస్తుంది.

## 30

శరీరము నుండి వ్యక్తమయ్యే భావము గాని, భాష గాని, చేత కాని అపవిత్రమైనదైతే వెంటనే శరీరానికి మాలిన్యము అంటుతుంది. కృతయుగములో ఆ శరీరాన్ని దగ్ధము చేసి ఇంకో శరీరమును తీసుకునేవారు. తప్పులు జరగవచ్చు. తప్పుని ఒప్పుకోవడము వలన చాలా రకాలుగా మనకు పరిష్కారము వస్తుంది. తప్పును కప్పిపుచ్చుకోవడములో ఎక్కువ మెలికలు పడిపోతాయి. నా వలన ఈ పొరపాటు జరిగినది అనే వేదన లోపల లేనివాడికి జీవితములో ఎప్పటికీ నిష్కృతి లేదు. లోపల పశ్చాత్తాపము కలిగి అలాంటి పని మరల చేయనటువంటి ఒక స్థితి ఏర్పడితే పునీతుడైనట్లు.

# 31

మానసిక కక్ష్యలో ప్రధానంగా పడి ఉండే జీవుడు తన లోపల ఉండే వాయువుతో అనుసంధానం చేసుకోవాలి. పని ఉన్నప్పుడు పనిచేసుకొని, పని లేనప్పుడు మనస్సును తీసుకొనివెళ్లి శ్వాస మీద ఉంచాలి. శ్వాస ఆధారముగా సమాన వాయువు లోనికి అనగా స్పందనలోకి, సూక్ష్మ స్పందనలోనికి (హృదయము), అక్కడ నుండి ఉదాన వాయువు (కంఠము) ద్వారా, అటుపైన వ్యాన వాయువును (భ్రూమధ్యం) చేరి, ఆజ్ఞ నుంచి బయటకు రావడము జరుగుతుంది. ఈ కార్యక్రమమును 'అనిలాగ్ని ధారణము' అని అంటారు.

## 32

మనలో శివ స్థానము సహస్రారము నుంచి మూలాధారం వరకు గల సుషుమ్న నాడి అంతా వ్యాప్తి చెంది ఉంటుంది. ఈ సుషుమ్న నాడి ధగ ధగా మెరుస్తూ కాంతివంతమైన ఒక నిట్టనిలువు లింగాకారముగా ఉంటుంది. ఈ కాంతివంతమైన స్థితి ఆధారముగా, ప్రజ్ఞా కేంద్రాల ద్వారా శక్తి అన్నీ అల్లుతూ ఉంటుంది. శివ సంకల్పం మేరకు శుభమైన కార్యములు ధర్మపరముగా నిర్వర్తిస్తూ జీవిస్తే అది శివయజ్ఞ మవుతుంది. శుభమైన కార్యములు అహంకారముగా నిర్వర్తిస్తూ ఉంటే అది దక్ష యజ్ఞ మవుతుంది. దక్ష యజ్ఞమునకు ధ్వంసము తప్పదు.

# 33

ఎవరైతే లోకశ్రేయస్సు కోసము కృషి చేస్తూ ఉంటారో, వారికి ఈశ్వరుని యొక్క అష్టసిద్ధులు క్రమముగా అందుబాటులోకి వస్తాయి. ఎవరు తమ కోసము తాము జీవిస్తూ ఉంటారో వారికి ఐశ్వర్యములు ఉండీ ఉండనట్లుగా రకరకములుగా భ్రమ గొలిపి బాధపెడుతూ ఉంటాయి. తమ కోసం పనిచేసుకొనే వారికి, అన్నీ తామే పోగేసుకొని, తామే రక్షించుకుంటూ, తామే జాగ్రత్త పడుతున్నప్పటికీ కూడా పోతుంటాయి. ఇది సృష్టిలో కనబడేటటువంటి ఒక సత్యము. పదిమంది గురించి సేవ చేద్దామనుకొనే వారికి ప్రకృతి సంపదలన్నీ వారిచుట్టూ చేరుతూ ఉంటాయి. ప్రకృతే మనుష్యుల రూపములో, సన్నివేశాల రూపములో సహాయము చేస్తుంది.

## 34

సత్సంప్రదాయము ప్రకారము ఎవరు ఎవరికి నమస్కారము చేసినా ఆ నమస్కారము ఈశ్వరునికే చెందుతుంది. “జీవుల రూపములో ఈశ్వరుడున్నాడని” భాగవతము చెపుతుంది. అంతర్యామి సాధన చేసేవారు పెద్దవారిని దర్శించినపుడు రెండు చేతులతో నమస్కారము చేయాలి. చిన్నవాళ్లయితే నీ హృదయమందు చేయి పెట్టుకొని కళ్ళు మూసుకోవాలి. నమస్కారము నాకే అనుకునేవాడు ఈశ్వరుని అస్తిత్వాన్ని అంగీకరించడం లేదని అర్థము.

## 35

సంసార జీవులందరూ సహజముగా 'నా కిది వద్దు, ఇలా జరగకూడదు' అని అనుకుంటూ వుంటారు. ఇలా జరగకూడదు అనుకోవడము కూడ ఒక కోరికే. 'నాకిలా జరగాలి' అనుకున్నప్పుడు నీకెందుకు జరగాలి? 'నా కిలా జరగకూడదు' అన్నప్పుడు ఎందుకు జరగ కూడదు? అని పరమగురువులు అడుగుతారు. మనము కోరుకున్నవన్నీ ఎన్నో రకాలుగా మనలను బాధపెడతాయి. కోరుకోకపోయినా ఇబ్బందులు వస్తాయి. మనకున్నటువంటి శరీరముతో, ఇంద్రియములతో, మనస్సుతో జాగ్రదవస్థలో ఉన్నప్పుడు పనులన్నీ ఈశ్వరార్పణముగా చేయాలి. అపుడు మనము కోరుకున్న వన్నీ జరగడానికి అర్హత ఏర్పడుతుంది.

# 36

ప్రపంచములో సమర్థత ఉన్నవాళ్ళ ద్వారా చాలా మంచి పనులు జరుగుతాయి. సమర్థత లేకుండా దైవాన్ని ఆశ్రయించడము ఒకటి. సమర్థత వుండి దైవాన్ని ఆశ్రయించకపోవడము ఒకటి. సమర్థత ఉండి దైవాన్ని ఆశ్రయించడం ఒకటి. సమర్థత లేక దైవాన్ని ఆశ్రయించిన వారియందు వారి సమర్థతను దైవము పెంచుకుంటూ వస్తాడు. సమర్థత ఉండి దైవాన్ని ఆరాధన చేయనపుడు అతడు స్వశక్తితో నిలబడవలసి ఉంటుంది. సమర్థత ఉండి దైవాన్ని ఆశ్రయించినపుడు నిరహంకారములోకి వస్తాడు. అపుడు మరణము మనలను ఏమీ చేయలేదు.

## 37

సద్గురువు ఎవరియందు ఎక్కువ వాత్సల్యము కలిగి ఉంటాడంటే నిష్కారణముగా దూషించినా, విమర్శించినా, ఇబ్బందులు పెట్టినా ఎవరు మారు మాట్లాడకుండా ఆ ఇబ్బందిని భగవత్పరముగా అనుభవిస్తూ ఉంటారో వారి యొక్క కర్మను క్రమముగా సద్గురువు తాను ఆకర్షించి అటుపైన వారి జీవితాన్ని తేలిక చేస్తాడు. తేలిక అంటే కర్మ నివృత్తి ఎంత జరుగుతూ ఉంటే అంత యోగము లోనికి ప్రవేశించే అవకాశము కలిగి యోగము సిద్ధిస్తుంది.

# 38

ఆత్మ సాధనకు అనుబంధములైన కార్యక్రమములను మాత్రమే అనుసరిస్తూ, ఇతర కార్యక్రమములను సున్నితముగా ప్రక్కకు పెట్టగలిగినటువంటివాడే ఆత్మాను సంధానానికి యోగ్యత ఎక్కువ సంపాదించుకుంటూ ఉంటాడు. మనకు జీవితములో ఎంతోమంది పరిచయ మవుతూ ఉంటారు. వీరందరితో మనకు ఆత్మసంబంధమా లేక దేహ సంబంధమా తెలుసుకోవాలి. కర్తవ్యములేని కార్యక్రమములకు వెడుతూ ఉంటే ఆత్మ సాధనకు సమయముండదు. సమయము కాలిపోతుంది.

# 39

మధురముగా వైరాగ్యము కలిగించేది భాగవత మార్గము. జీవితములో కొన్ని కొన్ని సంఘటనల ద్వారా కొందరికి విరక్తి కలుగుతుంది. అపుడే దైవము మీద రుచి పెరిగి, ప్రపంచము మీద రుచి తగ్గుతుంది. "ఒక కంటితో ప్రపంచాన్ని, రెండవ కంటితో అదే ప్రపంచమును దైవముగా చూడడము" అనేది భాగవతములోని మరో రహస్యము. అపుడే లోపల పండే కార్యక్రమము ఒకటి జరుగుతూ ఉంటుంది. కొండల్లాంటి కర్మలు గూడ కరిగిపోతాయి.

## 40

బృహస్పతి యజ్ఞము అనగా మన వాక్కును సరిగా ఉపయోగించడం. ఉదయము లేచిన దగ్గర నుంచి రాత్రి వరకు మన వాక్కు వలన ఇతరులకు వికాసము కలగాలి. మనము మాట్లాడితే వెలుగు రావాలి. వెలుగు రావాలంటే సహస్రారము, ఆజ్ఞ, అనాహతము ఆధారముగా విశుద్ధి నుంచి వాక్కు వ్యక్తమవ్వాలి. స్వాధిష్ఠానము, మణిపూరకము (ఆవేశము, మమకారము) ఆధారముగా మాట్లాడుతుంటే ఆ శబ్దాలలో నుంచి చీకట్లు పుట్టుకొస్తాయి. అందుకని దానిని noise అన్నారు. ఉపయోగము లేని మాటలకు యమ నియమములు ఉండవు. ఒక దీక్ష ఉండదు. దక్ష సృష్టిలో ఉండే పరిస్థితి ఇదే.

# 41

మనలో మన ప్రమేయము లేకుండా ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరుగుతున్నాయి. వీటితో మనము అనుసంధానం చెందాలి. మన ప్రయత్నము లేకుండా జరిగే ఈ దివ్య ప్రజ్ఞను మనము గుర్తించాలి. పుట్టినప్పటినుండి సవ్యముగా జరిగే ఈ ఊపిరిపైన మనము దృష్టి పెట్టాలి. ఊపిరి సరిగా అందకపోతే దృష్టి పెడతాము. అలా కాకుండ మనలో జరిగే ఉచ్ఛ్వాస, నిశ్వాసలకు మొట్టమొదట కృతజ్ఞులమై ఉండాలి. మనలో దైవమున్నాడనే విశ్వాసానికి మనలో జరిగే ఊపిరే గుర్తు. వాయు రూపముగా నీ లోపలికి వచ్చి, బయటకు వెళ్ళేవాడే ప్రత్యక్ష బ్రహ్మ.

# 42

ఈశ్వరుడనగా శరీరధారులకు ఆత్మ స్వరూపుడు. ఈశ్వరుడు లేకపోతే మనము లేము. ఈశ్వరుని ప్రతిబింబముగా మనమున్నాము. ఈశ్వరుడు మనలో ఉండడము చేత పంచభూతములు పనిచేస్తున్నాయి. ఈశ్వరుడు మనలో ఉండడము చేతనే మనలో ఎరుక పనిచేస్తుంది. ఈశ్వరుడు ఉండడము చేతనే మనకు ఆయుర్దాయము ఉంటుంది. ఈశ్వరుడు మనయందు మనవలె ఉంటే, మనమే ఉన్నామని అనుకుంటూ ఉంటాము. నిజానికి నేను కాదు, ఉన్నది 'ఈశ్వరుడే' అని తెలియడమే జ్ఞానము. అపుడే ఈశ్వరుడు మనయందు పరిపూర్ణముగా అవతరించి మన సమస్తమును అతనే నిర్వర్తిస్తాడు.

## 43

సాధకులు తెలుసుకోవలసినది ఏమిటంటే మనకు కష్టము కలిగి బాధ కలుగుతున్నప్పుడు మనము చేయవలసినది భగవదారాధన. మనము కారణము అవ్వచ్చు, కాకపోవచ్చు. బాధాతప్త హృదయము కలవారు పరిష్కారముగా ఈశ్వర సాన్నిధ్యమును కల్పించుకొని, ఈశ్వరారాధన చేస్తుంటే లోపల ఉన్న పరమ ప్రశాంతమూర్తి అయిన దైవము మనకు హితము, పరిష్కారము, స్వస్థత చేకూరుస్తాడు. బాధలో దైవమును ఆరాధన చేయవలెనని జ్ఞప్తియందు ఉండడము భగవంతుని అనుగ్రహము. ఎపుడైతే బాధ కలిగినదో అపుడు మనము పశ్చాత్తప్తులమై జీవన క్రమమును మార్చుకోవడానికి ప్రయత్నము చేయాలి.

## 44

మాఘ మాసము అంటే మహత్తుతో కూడిన మాసము. లేనిది ఉన్నట్లుగను, ఉన్నది లేనట్లుగను సృష్టిలో మార్పు జరిగేటటువంటి తత్త్వము. పౌర్ణమి రోజున సూర్య చంద్రుల మధ్య 180 డిగ్రీల కోణము ఏర్పడి ప్రతిముఖంగా ఉంటారు. చక్కని అనుభూతి నిచ్చే పర్వదినము. పరమగురువులు పౌర్ణమి రోజున శ్రద్ధాళువులకు, భక్తి, తపన, ఉన్ముఖత కలిగిన వారికి మార్గదర్శకత్వము, సూచనలు ఇస్తామని తెలియచేశారు. సాన్నిధ్యము ఇస్తామని వాగ్దానము చేసి ఉన్నారు. అమావాస్య రోజున అమావాస్య తిథి 'ఆది ఘడియలు' ముఖ్యము. పౌర్ణమి రోజు పౌర్ణమి తిథి 'అంతము అయ్యే ఘడియలు' ముఖ్యము. రెండు తిథులకు ముందు ఆరు గంటలు, తరువాత ఆరు గంటలు అంతరంగము నందు దివ్యత్వముతో అనుసంధానము చెందే ప్రయత్నములో సాధకుడు ఉండాలి.

# 45

ప్రపంచము మొత్తానికి కూడ మరణమును దాటి జీవించే విధానాన్ని యిచ్చిన ఏకైక వాఙ్మయము భారతీయ వాఙ్మయము. ఈ విద్య చాల ప్రధానమైన విద్య. ఎవరు ఎపుడు ఎట్లా వెళ్లిపోతారన్నది సృష్టిలో ఎవ్వరూ చెప్పలేనిది. 'నేను సంసిద్ధుడను' అనే స్థితిలో ఉండాలి. అదే యోగవిద్య. శరీరము చేత మనము గెంటివేయబడడం కాకుండా, శరీరములో నుంచి మనము మర్యాదగా బయటకు వచ్చే విధానానికి సంబంధించిన సాధన ఒక ప్రక్కన జరగాలన్నది ప్రాచీన ఋషుల యొక్క ఆకాంక్ష. అదే ఈ యుగానికి యిచ్చే బోధ అని పరమగురువులు నిర్ణయం చేశారు.

## 46

మనము సహజముగా వాయువుతో గాకుండా ఎక్కువగా ఆలోచనలతో అనుసంధానం చెందుతూ ఉంటాము. ఆలోచనలన్నీ అగ్ని స్వరూపము. ఆ అగ్ని ఊరికే మనలను దగ్ధము చేస్తూ ఉంటుంది. అనగా కొంత ఆయుష్షు అయిపోతూ ఉంటుంది. ఈ అగ్ని అనే ప్రజ్ఞను మన వాయువుతో అనుసంధానం చేసుకుంటూ ఉండాలి. లేకపోతే యోగము లేదు. దీనినే అనిలాగ్ని ధారణము అంటారు.

## 47

ఆత్మకు స్వస్థానము భ్రూమధ్యము. మనము నిద్రకు ఉపక్రమించేటపుడు భ్రూమధ్యంలో మన ప్రజ్ఞను నిలబెట్టమని జ్వాల్ కూల్ మహర్షి చెప్తారు. అక్కడ ఒక దేవతామూర్తిని దర్శనం చేస్తూ గాని, ఒక ఉదయించే సూర్యబింబమును గాని భావన చేస్తూ నిద్రలోకి వెళ్ళాలి. అపుడు ఆ నిద్రకు వేరే ప్రయోజనము ఉంటుంది. నిద్రపోయే ముందు కాలము చాలా పవిత్రమైనటువంటి సమయముగా భావన చేయాలి. ప్రజ్ఞను ఉర్ధ్వగతికి పట్టించే ఈ అభ్యాసము సాధకులకు చాలా అవసరము.

## 48

భగవంతుని అస్తిత్వము నందు మేల్కొనని సంసారజీవులకు కర్మలొక విధముగా నుండును. సంసారులు కర్మలాచరించుట ఫలితముల కొరకు మాత్రమే. భగవంతుని యందు మేల్కొనిన వైరాగ్య సంపన్నులకు కర్మలు మరియొక విధముగా ఉండును. ప్రతివారు కోరికలతో ఫలితములను ఆశించి ఎంత గట్టిగా పనిచేస్తారో, వైరాగ్య సంపన్నులు గూడ ఫలితములను ఆశించకుండా అంత గట్టిగానూ పని చేయాలి. ఫలితము అక్కరలేదని కర్మలు ఎలా పడితే అలా అడ్డగోలుగా చేయకూడదు. కర్మల యొక్క ప్రధాన ఉద్దేశ్యము త్రికరణశుద్ధి. త్రికరణశుద్ధి లేకుండా చిత్తశుద్ధి రాదు. చిత్తశుద్ధితో పనిచేస్తేనే నీ నుండి క్రమముగా దైవము దివ్యమైన కార్యమును నిర్వర్తించడానికి వీలుంటుంది.

## 49

ఎవరైనా దుర్భాషలాడితే మౌనముగా భరించడం ఒక కళ్యాణగుణము. వాటిని నీ లోపల ఉండే వాసుదేవునకు సమర్పణ చేయాలి. నీలోని వాసుదేవుడు అందరిలోను ఉన్నాడు కాబట్టి, ఎవరు నీ యందు నిష్కారణముగా ఒక మాట వదిలారో లేక నీ యందు ఎవరు అకార్యము చేశారో అది క్రమముగా వారికే చెందేటట్లుగా వారిలోని వాసుదేవుని నుంచి కార్యక్రమము ప్రారంభమవుతుంది.

# 50

భగవంతుని సాక్షాత్కారం సృష్టిలో జీవుల ద్వారా లభిస్తుంది. జీవులను దుఃఖపెట్టుకుంటూ, వారిని గూర్చి నిర్వచనములు పలుకుతూ ఉంటే నిర్వచన బ్రహ్మగా తయారయి, మనకు తెలియకుండా ప్రక్కదారి పట్టేస్తాము. అష్టప్రకృతులలోకి మనము దిగకుండా ఉండడానికి, అష్టప్రకృతులను అధిష్ఠించి, అతీతుడైన భగవంతుని నీవు చూసే జీవులలో చూడగలగాలి. ఎంత చెప్పుకున్నా జీవులను చూడగానే మనకి వారి స్వభావమే గుర్తుకు వస్తుంది. "స్వభావాన్ని గుర్తించక నన్ను (దైవమును) గుర్తించు" అని చెపుతుంది భాగవతము.

# 51

శివుడు చతుర్ముఖ బ్రహ్మ నుండి తనకు తానుగా వ్యక్తమైనటువంటి వాడు. శివుడు మనకు తరింపు నిచ్చేటటువంటి వాడు. శివుడు సంకల్పిస్తే కానిదేమీ ఉండదు. శివసంకల్పమే మన సంకల్పంగా నెరవేరాలని *"తన్మే మనః శివసంకల్పమస్తు"* అని చదువుతాము. రుద్రుడు లేని జీవుల సృష్టిలో దీక్ష, పట్టుదల, ఇంద్రియములను దమించుట ఉండదు. రుద్రశక్తి లేకపోతే దేనియందు స్వామిత్వ ముండదు. పంచ భూతములు, పంచ కర్మేంద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచ ప్రాణములు రుద్రుని వశములో ఉంటాయి. రుద్రుడు అనుగ్రహిస్తే మరణము గూడ దగ్గరికి రాదు. రుద్రమంత్రము లన్నిటిలో అత్యుత్తమమైన మంత్రము *"యో రుద్రో విశ్వాభువనా వివేశ తస్మై రుద్రాయ నమో అస్తు."* ఈ మంత్రము ప్రతి రోజు 11 సార్లు చదువుకుంటే నమక, చమకాలు చదువుకున్న ఫలితము ఉంటుంది.

## 52

భగవద్ భక్తుడైనటువంటి వాడు జరుగుతున్న దానిని భగవంతుని లీలా విలాసముగా మాత్రమే చూడాలి తప్ప, మరియొక విధముగా భావించరాదు. జరిగిన దానికి కార్యకారణములు పూర్వజన్మలో ఉంటాయి. దానిని ఈశ్వరార్పణముగా తీసుకొని, మన కర్తవ్యము నందే మనము ఉన్ముఖులమై ఉండాలి. ప్రతీకారం చేస్తే అందులో నుంచి క్రొత్త కర్మలు పుట్టుకొస్తాయి.

## 53

త్రిగుణములకు అవతల నున్న బ్రహ్మమును 'పరబ్రహ్మము' అంటారు. త్రిగుణములకు అవతల ఉన్న విష్ణువుని 'మహావిష్ణువు' అంటారు. త్రిగుణములకు అతీతముగా ఉన్న శివుడిని 'పరమశివుడు' అంటారు. త్రిగుణములకు మించిన అమ్మను 'పరాశక్తి' అంటారు. జీవులంతా త్రిగుణములలో నుంచి పుట్టినవాళ్లు. త్రిగుణములు దాటిన వారి కథలు చదువుకుంటే మనకు గూడ త్రిగుణములు దాటిన స్థితి కలుగుతుంది. అపుడు కలి పురుషుడు తాకనటువంటి స్థితి ఏర్పడుతుంది.

## 54

భగవంతుని యొక్క స్పర్శ దండన రూపమున నైననూ లభించినచో కొన్ని వందల జన్మల యొక్క కర్మ దగ్ధమవుతుంది. దానితో జీవునకు మలినము లేని సంస్కారముచే శుద్ధ సత్త్వము నందు వసించే అవకాశము ఏర్పడుతుంది. మనలోని రజస్సు, తమస్సు మనలోని సత్త్వాన్ని క్రమ్మివేస్తాయి. అపుడు భావముల యందు, భాష యందు, చేతన యందు సమతుల్యము చెదరిపోతుంది. నిత్య సత్త్వము అనునది సత్త్వములో విశిష్టస్థితి. అందులో రజస్సు, తమస్సులు ప్రవేశించలేవు. ఇది సద్గురువుల యందు, భాగవతమూర్తుల యందు మనకు గోచరిస్తుంది.

## 55

దక్షప్రజాపతి పని ఏమిటంటే ఈ సృష్టిలో జీవులను ఏర్పాటు చేసి, వారికి ఒక విధి విధానము యిచ్చి, వారందరూ సుఖముగా ఉండడానికి నియమ నిబంధనలు యిచ్చేస్తాడు. అంతా ఇహమునకు సంబంధించిన వాటికే ప్రాముఖ్యత యిచ్చాడు. దక్ష సంతతి అంతా ఇక్కడ ఏ విధముగా వృద్ధి చెంది పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోవాలి, ఏ విధముగా సౌకర్యాలు ఏర్పాటుచేసుకోవాలి అనే కార్యక్రమములో నిమగ్నమై ఉంటారు. అందుకని దక్షప్రజాపతి సృష్టి అంతా మరణముతో అంతము చెందుతుంది. అలా కాకుండా మరణాతీతమైనటువంటి శాశ్వత కథలో జీవుడు ప్రవేశించడానికే భాగవత పారాయణమైనా, భగవద్గీత పారాయణమైనా ఉపయోగపడుతుంది.

## 56

వెండితెర మీద ఎన్నోరకములైన పాత్రలు ఎన్నో రకాలుగా ప్రవర్తిస్తూ ఉంటాయి. వెండితెరతో సంబంధము పెట్టుకోవు. సన్నివేశముతో సంబంధము ఉంటుంది. ఈ వెండితెర  ఉన్నంత సేపే ఎవరి ఆట అయినా. వెండితెర లేకపోతే అన్ని ఆటలు ఆగిపోతాయి. ఈ ఆటలు నవరసభరితముగా ఉంటాయి. ఇవన్నీ కాలము, దేశము, సన్నివేశములను బట్టి కలుగుతూ ఉంటాయి. వీటిలో మునిగిపోతే ఉక్కిరిబిక్కిరి అయిపోతాము. మునిగి పోకుండా, కొంతభాగము చూసేవాడుగా, గమనించే వాడుగా తయారయితే నీవు యోగిగా తయారవుతావు.

# 57

అంతర్యామిగా విష్ణువు అందరియందు ఉన్నాడు గనుక వారియందు సద్గుణములను మనము దర్శిస్తూ, కీర్తించాలి. అలా ఉండేవాళ్ళ ఆయువు వృద్ధి అవుతుంది. వారి ఆయువును కాలము గాని, సూర్యుడు గాని హరించరు. అంతర్యామి సేవలో గడచిన అహోరాత్రములు విష్ణుమయములే కనుక వంచన ఉండదు. విష్ణువుకి సమర్పణచేసి జీవించడం, దైవాన్ని లోపల, బయట దర్శిస్తూ జీవించడం వలన నరజన్మకి ఒక వైభవము ఉంటుంది. అదే నరజన్మకి ఫలశ్రుతి.

## 58

సరియైన కర్మాచరణము వలన సరియైన జ్ఞానమబ్బును. ఈ రెండును వేరు కాదు. మానవజన్మకు ఈ రెండును రెండు చేతుల వంటివి. దేనితో ప్రారంభించిననూ రెండవది లభించి, మొదటి దానికి కూడ సిద్ధి చేకూర్చును. కనుక సాంఖ్యము, యోగముల సమన్వయము సర్వజీవులకు శుభము. ప్రజ్ఞకు జ్ఞానము, దేహానికి కర్మ– ఈ రెండును సమన్వయముగా సాగితే దేహానికి, ప్రజ్ఞకి ఒక చక్కని అంగీకార మేర్పడుతుంది. ప్రజ్ఞ ఒకటి చెప్తే దేహమొకటి చెప్పదు. దేహానికి కావలసినది ప్రజ్ఞ చూస్తుంది, ప్రజ్ఞకు కావలసినది దేహం చేసిపెడుతూ ఉంటుంది.

## 59

సత్కార్యాలు చేయడం వలన సంస్కారము పెరుగుతూ ఉంటే సత్కార్య ఫలితం అంటుతుంది. సత్కార్యాలు చేస్తున్నామన్న భావన మాత్రమే పెరిగిపోతూ ఉంటే సంస్కారం పెరగదు. అప్పుడు చేస్తున్న పని అంతా శ్రమ అయిపోతుంది. దాని గురించి జరగవలసినటువంటి శుభమైన పరిణామము మనలో జరగదు. ఎవరికి సహాయము చేస్తున్నా అది దైవానికి సమర్పణగా భావించాలి. అప్పుడు మాత్రమే మనలో సంస్కారములు పెరుగుతాయి.

## 60

మనస్సుకు రెండు ముఖాలు ఉంటాయి. ఒకటి బహిర్ముఖము, రెండవది అంతర్ముఖము. బహిర్ముఖము బయటి విషయాలు చూపించడానికి పనికి వస్తుంది. మనస్సు అంతర్ముఖమైతే దివ్యలోకాలు కనిపిస్తాయి. అంతర్మనస్సుకు అంతరేంద్రియములు నిర్మాణమవుతూ ఉంటాయి. మన యొక్క ఆత్మ ప్రజ్ఞను ఫాలభాగములో సూర్యుడిగా భావన చేస్తూ ఉంటే, కొంతకాలానికి లోపల అంతర్మనస్సు తయారవుతూ ఉంటుంది. దానికి అంతర్దర్శనము, అంతర్ శ్రవణము, అంతర్ రుచి, అంతర్ స్పర్శ, అంతర్ ఘ్రాణము (వాసన చూడడం) అన్నీ ఏర్పడుతూ ఉంటాయి. అపుడు దేహభావన తగ్గుతూ ఉంటుంది.

## 61

సాంఖ్యము అంటే తెలిసిన జ్ఞానమును నిత్య జీవనములో మాటయందు, చేతయందు ప్రవేశపెట్టి నిర్వర్తించుకుంటూ ఉంటే తరింపునకు అవకాశము కలుగుతుంది. మామూలుగా దైవారాధనలు, పూజలు, అభిషేకములు చేసుకుంటూ ఉన్నా, నిత్యము మనము జీవించే ప్రవర్తన తీరులో మన లౌకికము వచ్చేస్తుంది. మనము ఇద్దరిగా చీలిపోయి ఉన్నాము. వంకరగా ఉండే స్వభావము నిలువుగా అవ్వాలన్నా, శుద్ధిలేని స్వభావము త్రికరణశుద్ధి పొందాలన్నా, తెలిసిన మంచి విషయమును ప్రతి చిన్నదానిలో అమలు పరచుకుంటూ ఉండాలి.

## 62

శ్రీకృష్ణుని కుమారుడు ప్రద్యుమ్నుడు. ప్రద్యుమ్నుడి కుమారుడు అనిరుద్ధుడు. అనిరుద్ధుని కుమారుడు వజ్రుడు. ఇవన్నీ మనలో ఉన్నటువంటి తత్త్వములు. శ్రీకృష్ణుని మనము వాసుదేవ తత్త్వముగా భావించినట్లయితే, అతని వెలుగు అనేటటువంటిది బుద్ధిగా (ప్రద్యుమ్నుడు) భావిస్తే, ఈ ప్రద్యుమ్నుడు అనేటటువంటి దైవము యొక్క వెలుగు ఇంద్రియముల ద్వారమున ప్రసరిస్తూ ఉంటే అతనిని అనిరుద్ధుడు అంటారు. ఈ విధముగా వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములు ఎవరియందు అయితే బాగా స్థిరపడి ఉంటాయో, వారి శరీరము వజ్రశరీరము అవుతుంది. వజ్రకాంతితో మెరుస్తూ ఉంటుంది. అట్టివారు చిరంజీవులుగా ఉంటారు.

## 63

జీవులలో దేవుడుండును కనుక భూతదయ వలన జీవుల రూపమున దేవుడు మెచ్చుకొనును. తత్ఫలితముగా దేవుని పాదముల సాన్నిధ్యము ఎరిగిన గురువులతో పొత్తు కుదురును. జీవులకు సేవ చేస్తాము కాబట్టి, దేవుడికి పూజ చేయనక్కరలేదు అని భావించకూడదు. దేవుడికి పూజ చేస్తే జీవులకు సేవ చేయాలన్న స్ఫూర్తి వస్తుంది. అంతేకాదు దైవము యొక్క అనుగ్రహము మనయందు ఉంటుంది. ఆ అనుగ్రహాన్ని జీవుల పాదసేవకని ఎక్కువగా నిర్వర్తించాలి. అలా నిర్వర్తించుకుంటే మనము పెరుగుతాము. లేకపోతే తెలియక అహంకారము లోనికి పెరుగుతాము. తెలుసుకుంటే తెలుసుకున్నామన్న అహంకారము, తెలుసుకొని ఆచరిస్తుంటే మేము ఆచరిస్తున్నామన్న అహంకారము. ఈ అహంకారమును కడుక్కోవాలి అంటే నిత్యము దైవపూజ చేయడం, జీవులలో దైవమును చూడడం చేయాలి.

## 64

మానవులకు ఇతరులను రక్షించు సాధనలో శరీరమునకు మించినది ఏదీ లేదు. శరీరము లేనివాళ్ళు శరీరము ఉన్నవాళ్లను ప్రోత్సహించి కలిసి పనిచేయవలసినదే. పరమగురువులు, దివ్య శరీరధారులందరూ శరీరములో ఉండి తమకు ఉన్ముఖంగా ఉండేవాళ్ళు ఉంటే తప్ప పనిచేయలేరు. సమయము ఒకటి కలిసి వచ్చి, జీవుడు శరీరంలోకి దిగి రావాలి. పుట్టి పెరగాలి, మళ్ళీ ఏదో ఒక రకముగా ప్రచోదనము కలగాలి. సమయము కుదరనంత వరకు ప్రచోదనము కలుగదు. శరీరములో దిగని వారికి అపరిమితత్త్వము ఉంటుంది. ఈ అపరిమితత్త్వము భూమి మీద పనిచేయాలంటే వాహికలు కావాలి. ఈ వాహికకు కొంత పవిత్రత, కొంత సంసిద్ధత, కొంత జ్ఞానము, కొంత సంస్కారము ఉండాలి.

## 65

మనకుకనిపించేశరీరానికివెనుకసూక్ష్మమైనటువంటి శరీరము ఒకటి ఉన్నది. ఈ స్థూల దేహమును ఆత్మగా నమ్మడం అనేది బుద్ధిమంతులు చేయరు. ఈ ప్రకృతి ద్వారా ఏర్పడిన రూపము తానే అని అనుకోరు. ఇది ఒక తత్త్వదర్శనము. శరీరమే తాను అనుకున్నవాడు దానితో పీటముడి వేసుకోవడము వలన చాలా వ్యథ చెందుతాడు. ఈ కనబడే ఆకారమును ఏర్పరుస్తున్నటువంటి శక్తి మరియొకటి ఉన్నది. అది శక్తిమయము, ప్రజ్ఞామయము, సూక్ష్మమయము. దీనిలో వెలుగు ఎక్కువ ఉంటుంది. తరంగములు ఏర్పడుతూ ఉంటాయి. సున్నితత్త్వము ఉంటుంది. హనుమంతుడు స్థూల శరీరములో కన్నా సూక్ష్మ శరీరములో ఎక్కువగా వసించి ఉంటాడు.

# 66

'ఓం' అనేటటువంటిది దైవాన్ని పిలవడానికి ఇచ్చే పిలుపు. ఇటు నుంచి 'ఓం' అంటే అటు నుంచి దైవము 'ఓం' అంటాడు. బాగా ఓంకారము చేసి వింటే లోపలి నుంచి ప్రతిధ్వనిగా 'ఓం' వినబడుతుంది. వింటున్నంత సేపు నిశ్శబ్దముగా ఉండాలి. ఒకసారి ఓంకారము చేసిన తరువాత ఎంతసేపు 'ఓం' అని అంటామో అంతసేపు విరామము ఇవ్వాలి. తరువాత తాను విన్నది హృదయము నుంచి ఉచ్చరించాలి. అలా 'ఓం' అని ఉచ్చరించి వినేవారికి, కొంత అభ్యాసము అయిన తరువాత అనకపోయినా వినబడుతుంది. వినబడితే కనబడుతుంది. ఇదీ ఓంకారము ప్రత్యేకత.

## 67

మన లోపల దైవాన్ని చూడమంటున్నది భాగవతము. లోపల దైవాన్ని చూస్తే బయట కూడా అదే కనిపించి, ఈశ్వర దర్శనము అవుతుంది. కాబట్టి మనకు అత్యంత సమీపములో ఉన్న ప్రాణ స్నేహితుడు ఎవరంటే మన రూపములో ఉన్న దైవమే. మనలో ప్రాణముగా, తెలివిగా, చాలా రకాల ప్రజ్ఞలుగా ఉన్నాడు. అలాంటి దైవముతో నిరంతరముగా అనుసంధానం చెందడమన్నది సూటి అయిన, ముఖ్యమైన సాధన. అపుడే మనకు ఈశ్వరత్వము అబ్బుతుంది. ఈశ్వరుడు అంటే శివుడని కాదు, సమస్తమునకు అధికారి అని అర్థము.

## 68

మనము సృష్టిని బయటకు వెళ్లి చోటులో నుంచి చూడగలిగితే సృష్టి ఒక చేపవలె కనబడుతుంది. అది అపరిమితమైన నీలములో తేలుతూ ఉంటుంది. దానికి ఆధారము ఏమిటంటే సత్యము, పరము. సత్యము నుంచి వచ్చిన వాటి అన్నిటికీ పరిమిత తత్త్వముంటుంది. పరిమిత తత్త్వమును ఛేదిస్తే సత్యమవుతుంది. ఏది అయితే పరిమితముగా ఉన్నట్లు గోచరిస్తుందో, కాని పరిమితము కాదో, ఆ తత్త్వమునకు భాగవతము అని పేరు. దీనినే కలియుగములో మానవులకు అందించాలని ఋషుల తాపత్రయము.

## 69

భాగవతము చదువుకుంటే సత్త్వము యొక్క విలువ తెలుస్తుంది. సత్త్వములో ప్రవేశిస్తే ప్రతి మనిషిలో ఉండేటటువంటి కళ్యాణ గుణములే కనిపిస్తాయి. అనంత తత్త్వమునకు చెందినది సత్త్వగుణము. సత్త్వము, రజస్సు, తమో గుణములు మూడును ప్రకృతి గుణములు అయినను, అందు సత్త్వము ఉత్తమ ప్రకృతి. అది పరమాత్మ ప్రకృతిని తెలియచేయును. అనగా సత్త్వములో ఉంటేనే పరమాత్మ యొక్క స్వరూప స్వభావాలు తెలుస్తాయి. ఎవరు ఎంత సత్త్వము లోనికి చొచ్చుకొని వెడితే వారికి అంత విశదమవుతుంది. సత్త్వగుణము బాగా పెరగాలంటే విష్ణువుని ఆరాధించాలి. సత్త్వము పెరిగి, స్థిరపడిన తరువాత ఇక మిగిలేది విష్ణువే.

## 70

బృహస్పతి బాగా వినడానికి అధిదేవత. బాగా వినగలిగిన వారే బాగా మాట్లాడగలరు. పైలోకాల లోంచి నిశ్శబ్దాన్ని విని, శబ్దరూపాన్ని దానికి ఏర్పరచి, సమాంతరంగా అందించినవారు బాగా విన్నవారి క్రింద లెక్క. బృహస్పతి స్పర్శచేత నిశ్శబ్దములో నుంచి వారికి భావాలు వస్తూ ఉంటాయి. బృహస్పతితో సంబంధము ఉండి, ఒక ప్రక్క సరస్వతి అనుగ్రహము కూడ ఉన్నవారు మనలో జీవ చైతన్యాన్ని, దైవ చైతన్యాన్ని నింపి, దివ్యమైన విషయములు హృదయములో హత్తుకునేటట్లుగా, హృదయములో స్థిరపడేటట్లుగా చెప్పగలుగుతారు. వినాయకుడు లేని ఎలుక ఎటువంటిదో, బృహస్పతి అనుగ్రహము లేని భాషణము అటువంటిది. బృహస్పతి అంటే గురుగ్రహము. గురుగ్రహము అంటే గురువే. గురువు అనుగ్రహము వల్ల వచ్చే మాట వేరు. గురువు అనుగ్రహము లేనప్పుడు వారి నుంచి వచ్చే మాటలు వాసన లేని పుష్పముల వలె (కాగితపు పుష్పముల వలె) ఉండును.

# 71

దైవమును 'తత్త్వము' అని వేదములో అంటారు. తనకన్నా వేరుగా చూడబడుతున్న ప్రపంచము గూడ తత్త్వమే. తత్ అంటే అది. త్వమ్ అంటే నీవే. 'అది నీవే'. వేదములో తత్త్వము అంటే ఉపనిషత్తులలో 'బ్రహ్మము' అంటారు. బ్రహ్మము అంటే బృంహణము చేయబడినది. శాస్త్రజ్ఞులు 'పరమాత్మ' అంటారు. ఈ ఆత్మలన్నింటికి పరమైనటువంటిది అని శాస్త్రజ్ఞులు చెపుతారు. భగము అంటే పుట్టుక స్థానము. అక్కడినుంచి తానే పుట్టుకొస్తూ ఉంటాడు. అందుకని భక్తులు 'భగవంతుడు' అంటారు. భాగవతము 'అంతర్యామి' అని చెబుతున్నది. ఇన్నిటిలోనూ తానే ఉన్నాడు.

# 72

మనకి గురుప్రార్థన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా ఇచ్ఛ, జ్ఞాన, క్రియగా ఇచ్చారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులంటే సృష్టి త్రిభుజము. దానికి అతీతంగా పరతత్త్వమున్నది. అందుకే గురుయంత్ర మిచ్చారు. ఒక వృత్తములో ఒక సమకోణ త్రిభుజము ఏర్పాటుచేసి, దాని మధ్యలో ఒక బిందువును పెడతారు. ఈ బిందువు ఆ పరతత్త్వములోకి వెళ్లుటకు మార్గము. ముందు మనము ఈ బిందువులోకి ప్రవేశించాలి. ఈ బిందువు మనలో ఉన్న త్రిగుణములకి సమన్వయం ఏర్పడినప్పుడు ఉంటుంది. అపుడే సమకోణ త్రిభుజము తయారవుతుంది. ఈ బిందువులోకి ప్రవేశిస్తే పరతత్త్వములోకి ప్రవేశించవచ్చు. అక్కడ నాదస్వరూపుడిగా దైవముంటాడు. బిందు స్వరూపముగా అమ్మవారుంటుంది. నాదము, బిందువు, త్రిభుజము లేక త్రిశక్తులు. మొత్తము ఐదు. ఈ ఐదు, ఐదు మాత్రలుగా 'పంచాక్షరి' అని చెపుతారు.

## 73

సృష్టిలో జీవుడు దేహమును ధరించినపుడు త్రిగుణములలో ప్రవేశించి గుణాత్మకుడవుతాడు. అంతకు ముందు జీవుడు గుణాతీతుడైన దైవమే. మంచుగడ్డ నీరే అయినా, స్థితిభేదము చెందడం వలన కొన్ని ప్రత్యేక లక్షణములు వస్తున్నాయి. అటువంటి స్థితిభేదము మనలో ఎనిమిదిసార్లు జరుగుతుంది. మూడు గుణములు, ఐదు పంచభూతములతో జీవుడు ఎనిమిది మార్పులు చెందుతాడు. ఈ ఎనిమిదిని అష్టలక్ష్ములు అంటారు. ఇవే అమ్మవారి ఎనిమిది స్థితులు. అమ్మవారు అంటే ఆవిడలో అయ్యవారుంటారు. అమ్మవారు తొమ్మిదయితే, అయ్యవారు పది. మనము ఎనిమిది స్థితులుగా మార్పు చెందితే మనము ఒకరున్నామని అనిపిస్తుంది. మనము వేరుగా ఉన్నామని అనిపించుటే మొదటి అవిద్య. ఆ అవిద్య పోతే, జీవుడికి పరిష్కారము వస్తుంది.

## 74

మనము లేని స్థితిలోనికి వెళ్లడం నిద్ర. నిద్రలో మనము ఉంటాము కాని, మనమున్నామని మనకు తెలియదు. మెలకువ వచ్చిన తరువాత తెలుస్తుంది. మెలకువ అనగా మనము ఉన్న స్థితిలోకి రావడం. మెలకువ రాగానే మన మూలమును గూర్చిన భావన ఉండాలి. మనుష్యులు నిద్రపోవడం వేరు. యోగులు నిద్రపోవడం వేరు. యోగులు నిద్రపోయినా, వారి చైతన్య స్థితిని బట్టి వేరే లోకాలలో మెలకువగా ఉంటారు. యోగాన్ని అభ్యాసము చేసేవారు నిద్ర నుంచి ఎలా మెలకువ వచ్చింది, నిద్రలోకి ఎలా వెడుతున్నాము అని ఈ రెండు సమయములను చాలా విలువైనవిగా భావించి, గమనిస్తారు. ఇది భాగవతము చెప్పే ఆత్మపరమైన సాధన.

## 75

ప్రతి జీవుడు సహజముగా స్వయంప్రకాశకుడే. ఒకే అంతర్యామి తత్త్వము నుంచి దిగివచ్చినప్పటికీ స్వభావ బలము చేత వేరుగా ప్రవర్తిస్తాడు. జీవుడు స్వభావాన్ని జన్మల తరబడి పెట్టి పోషించుట వలన అది అంత సులభముగా కరగదు. అది కరగాలంటే చాలా తపన, ఆరాధన ఉండాలి. దైవచింతన ఉంటే దానిలో ఉండే అగ్నితత్త్వము మనలను శుద్ధి చేస్తూ ఉంటుంది. దైవచింతన కొద్దిసేపే ఉంటే మిగతా రోజంతా పొయ్యి ఆరిపోయినట్లు ఉంటుంది. ఆరిపోయిన పొయ్యి మీద ఏదీ ఉడకదు గదా!

# 76

జీవుడు లోపలికి వెళ్లడం అంటే చిత్తము అంతర్ముఖమవడం. దీనినే అంతఃకరణము లోకి ప్రవేశించడం అంటారు. చిత్తము అంతర్ముఖమైతే సంగముండదు. బహిర్ముఖమైతే నాది, నావాళ్ళు, నేను, నా ఆస్తిపాస్తులు మొదలగు వాటి గురించి ఆలోచిస్తూ ఉంటుంది. చిత్తము ఇంద్రియముల ద్వారా సంగము ఏర్పరచుకుంటూ ఉంటుంది. సంగము ఉన్నప్పుడు వైరాగ్యము వచ్చినట్లు కాదు. భాగవతము ఏమి చెప్తున్నది అంటే ఈ మొత్తమును దైవముగా దర్శనం చేస్తే చిత్తానికి అతుక్కు పోవడముండదు. సంగదోషము పోతే ఉన్న స్థితే మోక్ష స్థితి.

## 77

సంకల్పములు అనేవి ప్రవాహము లాగా వస్తూ ఉంటాయి. ప్రవాహములో మునగకుండా గమనిస్తూ ఉండాలి. ప్రవాహములో పడిపోతే అది నిన్ను పట్టుకుపోతుంది. గమనిస్తూ వుంటే అక్కరలేని తిరుగుళ్లు, తిండి, మాట, ఆలోచనలు గూడ రావు. సముద్రపు ఒడ్డున కూర్చుని అనంతమైన అలలను చూస్తున్నట్లుగా, మనసులో కలిగే భావాలను గమనిస్తూ ఉండడమే. ఇదే ధ్యానానికి ప్రాథమికమైన స్థితి. అప్పుడే స్థిరమైన మనస్సు ఏర్పడుతుంది. మూడు గుణములకు లోబడని ప్రజ్ఞగా ఉంటాము.

## 78

మనము జన్మించగానే క్రమముగా మనకు అందించబడే సూత్రము ఏదైతే సృష్టిలో ఉన్నదో దానిని 'పూర్వచిత్తి' అంటారు. అనగా పూర్వము నుండి మనలో ఉండే స్వభావమే పూర్వచిత్తి. మనమే మన స్వభావాన్ని తెచ్చుకుంటాము. మన స్వభావాన్ని బట్టే మన తల్లిదండ్రులను ఎన్నుకోవడము జరుగుతుంది. మన స్వభావము బట్టే పరిస్థితులు ఏర్పడుతూ ఉంటాయి. ఈ స్వభావాన్ని చక్కగా సరిదిద్దుకోవాలంటే మన ప్రవర్తనలో పరివర్తన రావాలి. ఎవరి శుభవాసన, అశుభవాసన జన్మించగానే వారితో వస్తుంది. మన యొక్క వాసనలు మనము పరిశీలించుకొని, గమనించుకొని అందులో ఏవి వర్జనీయము, వేటిని పట్టుకొని మనము ముందుకు వెళ్ళాలి అనేది తెలుసుకోవాలి.

# 79

సృష్టి మొదట్లో సురలు అసురులు, జ్ఞానులు అజ్ఞానులు, పండీ పండనివారు, కొద్ది కొద్దిగా పండుతూ పచ్చిగా ఉన్నవారు, కొద్దిగా పచ్చిగా ఉండి, బాగా పండినవారు– వీరందరినీ సృష్టి ప్రళయములోనికి వెళ్లేటప్పుడు మూసేశారు. నారాయణుని కడుపులోకి వెళ్లిన సరుకే ఇది. తిరిగి వచ్చేటప్పుడు సృష్టిలోకి అలాగే శ్రేణుల ప్రకారము దిగి వచ్చేస్తారు. ఒక రోజు రాత్రి నిద్రలో ఒక్కసారిగా నాణ్యత పెరిగి దివ్యపురుషులు అవ్వరు. నిద్రలేచిన తరువాత అంతకు ముందు తెలియనిది ఇప్పుడు తెలియడముండదు. "నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి. నేను తోడ్పాటు ఇస్తాను" అంటాడు కృష్ణుడు. స్వయంకృషికి కావలసిన బలము ఇవ్వమని దైవాన్నే అడగాలి. నాకు వేపకాయంత స్ఫూర్తి ఉన్నది, అది గుమ్మడికాయంత చేయమని ప్రార్థించాలి.

## 80

విరాట్పురుషుని అంశలుగా, ఒకే వెలుగు నుంచి సూక్ష్మరూపముగా దిగివచ్చాము. ఆ వెలుగే తనయందు, ఇతరుల యందు పనిచేస్తున్నది. ఆ వెలుగు యందు ఉండి, బుద్ధి కక్ష్యలోనికి వెడితే విడిగా ఉన్నట్లు ఉంటుంది గాని, మొత్తముతో కలిసి ఉంటుంది. మొత్తముతో కలిసి విడిగా ఉండడము వేరు. మొత్తముతో తెగతెంపులు చేసుకొని విడిగా ఉండడము వేరు. అందరం ఒకే చోటు నుంచి వచ్చాము. మనకున్న శక్తి, ప్రజ్ఞ, పదార్థములో తేడాను బట్టి మన ప్రవర్తనలో గూడ తేడా ఉంటుంది. దానిని సరిదిద్దుకోవడానికే భాగవత శ్రవణము, పఠనము.

# 81

మహాయోగులకు మూడు శరీరములు ఉంటాయి. ఈ మూడు శరీరములు ఉన్నవారిలో హనుమంతుడు గొప్పవాడు, ప్రథముడు. ఈ మూడు శరీరములతో మూడు లోకములలో పనులు నిర్వర్తిస్తాడు. హనుమంతుడిది వజ్రశరీర కాంతి. అలాంటి హనుమంతుడు నారాయణ తత్త్వముతో ఏకీభావన చెందడానికి ధ్యానము చేస్తూ ఉంటాడు. ఆ విధముగా నారాయణునితో కూడి ఉంటే సృష్టి వైభవాన్ని అనుభూతి చెందవచ్చు. యోగులు సూక్ష్మలోకములలో, కారణలోకములలో నేనున్నాను అన్న భావనతో దివ్యమైన కార్యక్రమములు చేస్తారు. కాని నారాయణుని చేరడానికి వీలుపడదు. హనుమంతుడిది నేనున్నాను అనే భావన, శాశ్వతముగా కరిగిపోయిన స్థితి.

## 82

మానవుని శరీరము కన్నా మించిన శరీరము సృష్టిలో ఎవ్వరికీ లేదు. దేవతలకి గూడ లేదు. అన్ని లోకాలలో తిరగ గలిగే శక్తి మానవ ప్రజ్ఞకే ఉన్నది. దేవతలు భూమిని ముట్టుకోలేరు. జంతువులు పైకి వెళ్లలేవు. ఇలాంటి మానవ శరీరాన్ని చక్కగా ఉపయోగించుకోవాలి. అది అహంకారము పోతే గాని వీలుపడదు. నిరహంకార స్థితికి చేరుకున్న జన్మను శుభమైన జన్మగా పరిగణిస్తారు. దైవము వలనే నేను ఉన్నాను అనే భావన స్థిరమైతే అహంకారము తగ్గి, లోపల అహంకారము బంటువలె పనిచేస్తుంది. అహంకారానికి శిక్షణ యివ్వడానికి ఆత్మజ్ఞానము అవసరము. అది భాగవతము యిస్తుంది.

## 83

కర్మ యొక్క ఫలమే త్రికరణశుద్ధి. భావన, వాక్కు, చేత ఒకే రకముగా ఏర్పాటు చేసుకోవాలి. ఒకే సూత్రము మీదకి ఎక్కించాలి. అపుడే త్రికరణశుద్ధి కలుగుతుంది. లోపల ఒక మాట, బయట ఒక మాట ఉండకూడదు. అలా ఉండే వారి మీద పరమగురువుల దృష్టి పడదు. ఆశీర్వచనము ఉండదు. త్రికరణశుద్ధి ఉన్నవాడికి శ్రద్ధ ఉంటుంది. శ్రద్ధ వలన జ్ఞానము నిత్యనూతనముగా నీ యందు భాసిస్తుంది. యోగులందరికీ జ్ఞానము లోపల నుంచి భాసిస్తుంది. త్రికరణశుద్ధి ఉన్న వారినే పరమగురువులు వాహికలుగా ఎన్నుకుంటారు.

# 84

భగవంతునితో ఎట్టి పరిస్థితులలోనూ ఎడతెగని సంబంధము కలవారిని మహాభక్తులు అంటారు. ఒక్కొక్క సారి మనము ఎంత ముడి వేసుకున్నా అటునుంచి ఆయన వదిలివేస్తే మన ముడి జారిపోతుంది. మన ప్రయత్నము ఎంత చేస్తున్నప్పటికి ఆయన మనతో కలిసి ఉండడము ఆయన అనుగ్రహము. ఆయన కొంతమందిని ఎప్పుడూ పట్టుకుంటాడు. కొంతమందిని అప్పుడప్పుడు పట్టుకుంటాడు. కొంతమందిని పట్టి వదులుతుంటాడు. మనలో రావలసిన పరివర్తనమును బట్టి అనుగ్రహము ఉంటుంది.

## 85

సంధ్యా సమయము చాలా ముఖ్యమైనది, విలువైనది. ఉభయ సంధ్యలలో అనవసరమైన మాటలు మాట్లాడడం, నిద్రపోవడం, అక్కరలేని పనులు చేయకూడదు. మొత్తము సృష్టిలో సంధ్యాసమయమును ఎవరూ వర్ణించలేకపోయారని మాస్టర్ ఇ.కె.గారు 'Spiritual Astrology' లో చెప్పారు. లోకము, అలోకము అనే రెండింటి దర్శనములు యిచ్చే అద్భుతమైన కాలము. మనలో ప్రాణశక్తి బాగా పని చేయాలంటే రెండు సంధ్యల యందు శుచియై, కనులు మూసుకొని కూర్చోవాలి. అందుకే మాస్టరుగారు రెండు సంధ్యలకు రెండు మేకులు కొట్టారు (ప్రేయర్).

# 86

మనలోని దైవాన్నే ఈశ్వరుడు లేక వాసుదేవుడు అంటాము. వాసుదేవుని ఆధీనములోనే మనయందు ప్రాణస్పందనలు జరుగుతూ ఉంటాయి. అందుకని ఆత్మానుభూతికి ఈశ్వరునితో అనుసంధానం చెందడానికి ప్రయత్నము చేస్తూ ఉంటాము. మనము దైవాన్ని చేరడానికి ఏర్పరచుకున్న దీక్షలో అంతరాయములు లేకుండా ఉంటే, అపుడు ఈ జీవుడికి ఉద్ధారణ కలిగిద్దాము అని దేవుడికి అనిపిస్తుంది. అలా దైవానికి ఒక జీవుని విషయములో అనిపించడాన్ని అనుగ్రహము అంటారు. ఎవరిని భగవంతుడు అనుగ్రహింప దలచుకున్నాడో వారియందు తానే ప్రేరణ యిస్తాడు.

## 87

మన చుట్టూవున్న భావాలనే బావిలో కూరుకు పోయిన దానిలో నుంచి బయటకు రావాలంటే ఒకసారి 'నే నెవరు' అని గుర్తుకు తెచ్చుకోవాలి. మన జీవితము అంతా లేచిన దగ్గరనుంచి పడుకొనేవరకు ఒక నటుడిగా నటిస్తున్నాము అని గుర్తున్నవాడు ధన్యుడు. నిద్రలేవగానే నేనెవరని జ్ఞాపకము చేసుకోవాలి. ఇదే Master key. కాని మనము మన పాత్రలోకి దిగిపోతాము. పాత్రలోకి దిగినా చేసే ప్రతి కార్యక్రమములోనూ అదే ఇదిగా ఉన్నదని, దర్శించమని ఒక రహస్యమును ఉపనిషత్తులు చెప్పాయి. "ఒక కన్నుతో లోకాన్ని చూస్తూ, ఇంకొక కన్నుతో ఆ లోకానికి మూలమైన దాన్ని చూస్తుండాలి. అలా క్రమముగా చేస్తుంటే మూడవ కన్ను తెరుచుకుంటుందని" జ్వాల్‌కూల్ మహర్షి చెబుతారు.

## 88

ఒక పని చేస్తున్నప్పుడు ప్రారంభములో ఎంత శ్రద్ధ ఉంటుందో రోజూ అలాగే పది, ఇరువది, ముప్పది సంవత్సరాలు గూడ చేయుచున్నచో దానిని శ్రద్ధ అంటారు. శ్రద్ధ వలన నీలో ఉన్న ప్రజ్ఞకు ఒక స్ఫూర్తి, ఒక ప్రమాణము ఉంటుంది. శ్రద్ధ లేకపోతే గ్రహించే బలము గూడ తగ్గుతుంది. కూర్చోవడములో, నడవడములో, పలకరించడములో, వస్త్రధారణలో శ్రద్ధ అవసరము. ఎపుడూ ఒకే రకమైన శ్రద్ధ ఉంటే కళ పెరుగుతుంది. మనిషిలో శ్రద్ధను బట్టి వికాసము ఉంటుంది. శ్రద్ధను బట్టి పరిసరాలలో ఉన్న తత్త్వమును గ్రహించడములో మన అర్హత పెరుగుతుంది. "శ్రద్ధ తన స్వరూపమే అనియు, దానిని జీవుడెంతగా ఆరాధించునో అతడు అంతగా తన స్థితి చెందుననియు" భగవద్గీతలో కృష్ణుడు చెప్పాడు.

## 89

దినచర్యలో దైవాన్ని దర్శించడానికి ఒక ప్రయత్నము చేయడం భాగవత మార్గము. ఉదయము లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకొనేలోపు ఎన్ని సన్నివేశాలలో, ఎన్ని రూపాలలో దైవాన్ని దర్శించి, ప్రతిస్పందిస్తావో చూసుకోవాలి. వచ్చినవాడు నారాయణుడు కాబట్టి, అతనికి మనము చేయగలిగినది ఏమైనా ఉంటే చేయటమే భాగవతము. వీని నుండి ఏమి పొందగలను అని భావించడం లౌక్యము. అన్నింటిలో దైవాన్ని వెదికి చూసేవాడినే పరీక్షిత్తు అన్నారు. 'అదే, ఇది' అని మనలో నరనరాలలోకి, కణకణాలలోకి శాశ్వతముగా యింకాలి. అపుడు దైవము మనకు దగ్గరవుతాడు. అదీ సామీప్య మంటే. దైవము కనిపించడము 'సాలోక్యము'. దగ్గర అవడము 'సామీప్యము'. కలిసిపోవడము 'సాయుజ్యము'. మధ్య మధ్యలో అతడైపోతూ ఉండడము 'సారూప్యము'. దిన చర్యయందు దైవమును దర్శించుట వలన క్రమక్రమముగా ఈ నాలుగు స్థితులను పొందవచ్చును.

# 90

జీవుడు స్వయంప్రకాశకుడు. అనగా సహజముగా వెలుగు కలిగిన వాడు. బుద్ధి అనే వెలుగు ప్రతివాడికి ఉంటుంది. ఎంత సామాన్య జీవికైనా అతని కన్నులనుండి కనిపించేది వెలుగే. బుద్ధి ఆధారముగా మనస్సును, ఇంద్రియములను, శరీరమును వినియోగించుకుంటూ ఉండాలి. ఇదే ఆత్మయోగ నిష్ఠ. అనగా ఆత్మతో బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, శరీరము యోగము చెంది, ఒక సూత్రమున కెక్కిన పూసల వలె ఉంటాయి. ఆత్మ అలా అధిష్ఠించి ఉండకపోతే మనస్సు బాగా చెలరేగి తన ఇష్టమొచ్చినట్లు పనిచేస్తూ ఉంటుంది. అందుచేత ప్రతి నిత్యము 'నేను ఆత్మను, పరమాత్మ చేత వ్యక్తమైన వాడను' అని గుర్తు తెచ్చుకోవాలి.

## 91

నిద్ర లేవగానే మనము ఉండవలసిన స్థానము భ్రూమధ్యము. అక్కడ కూర్చుంటే మనకు ఏమి చేయాలో తెలుస్తూ ఉంటుంది. మనము బొడ్డు స్థానములో కూర్చుంటాము. బొడ్డు మనసుకు స్థానము. ఆత్మ ఆజ్ఞా కేంద్రము. ఫాలభాగము నందు కూర్చుంటే రాజ సింహాసనము నందు కూర్చున్నట్లు లెక్క. నువ్వు కూర్చోవలసిన స్థానములో నువ్వు కూర్చొని, నిన్ను నువ్వు పరిపాలించు కోవడమును ఆత్మయోగనిష్ఠ అంటారు. ఉదయము లేవగానే నిన్ను నీవు అమరికగా ఒక పద్ధతిలో పెట్టుకోవాలి. అపుడు నీవు నీ జీవితానికి రాజువు. మహర్షులందరూ అలాగే ఉంటారు. వారు నిజమైన ఆత్మనిష్ఠాపరులు.

## 92

మన ప్రజ్ఞ ఆత్మను గురించి బాగా ధ్యాస కలిగి ఉండాలి. నేను ఆత్మ స్వరూపుడను, స్వయంప్రకాశకుడను, శాశ్వతుడను అని మాటి మాటికి గుర్తు చేసుకోవడమే ధ్యాస. ఆ ధ్యాస లేకుండా ఎన్నిచేసినా ఒకటే. ఒకటి లేకుండా ఎన్ని సున్నాలు పెట్టినా విలువ లేదుగదా! బాగా తత్త్వ విచారణ చేస్తూవుంటే నీ గురించి, దైవము గురించి అవగాహన పెరుగుతుంది. సనత్కుమారుడు "నేను నేనైన నేను" గా ఉండమని చెపుతున్నాడు. ఉదయము నుంచి సాయంత్రము వరకు మానవుని ప్రజ్ఞ మనస్సులోనే ఎక్కువ ఉండిపోతుంది. శరీరమే తాను అనుకున్నవాడు ఏడు అంతస్తుల భవనము కట్టుకున్నా 'సెల్లార్'లో పడివుంటాడు.

## 93

ఆజ్ఞాకేంద్రము నందు ప్రజ్ఞ సహజముగా ఉన్నవారిని స్వయంపరిపాలకుడు అంటారు. అలాంటి వారికి ఎవరి చేత ఏమీ చెప్పించుకోవలసిన అవసరము రాదు. వారు కాలమెరిగి, దేశమెరిగి, ధర్మమెరిగి ప్రవర్తిస్తూ ఉంటారు. రూపము, నామము, కర్మేంద్రియ జ్ఞానేంద్రియములు, మనస్సు అన్నీ వచ్చి పోతూ ఉంటాయి. మన బుద్ధి అనే వెలుగు మనతో ఉంటుంది. అది సహజమైన వెలుగు. వచ్చే పోయే విషయాలలో కొట్టుకుపోకుండా తాను తానుగా ఉండడానికి ప్రతి నిత్యము తత్త్వమునందు ధ్యాస పెట్టాలి.

## 94

నారాయణుని కథలను నోరారా పలుకుచు వినుచుండుట. భగవంతుని లీలలను, గుణములను, కార్యములను ప్రస్తుతి చేసుకుంటూ ఉండడము వలన మనలో ఉండే కొన్ని మాలిన్యములు వెళ్లిపోతాయి. పుణ్యమైన విషయముల యందు మనస్సుకు ఆసక్తి పెరుగుతూ ఉంటే అశుద్ధి వెళ్ళిపోతుంది. దానిలో ఉండే మహిమ అది. సత్యమును గూర్చిన ప్రసంగం జరుగుతున్న చోట ఇతర విషయముల యందు ఆసక్తి ఉండదు. తదనుగుణమైన మనుష్యులే చేరతారు. నారాయణుని యందు పట్టుదల పుణ్యముగా మారి సాధకుడను వెలుగుగా పరిణమించును. దయా గుణము, దాన గుణము పెరుగుతాయి.

95

భగవంతుడే మనయందు ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా దిగివచ్చి ఉన్నాడు. దానిని 'హంసధ్వని' అంటారు. అక్కడ 'సోహం' శబ్దము వినిపిస్తూ ఉంటుంది. ఆ శబ్దము ఆధారంగా ఆ భావనలో లీనమై ఉంటే 'అతడే నేను' అను భావన స్థిరపడుతుంది. అపుడు దైవమే మనయందు ఆవేశించి తనను తాను ప్రకటించుకుంటాడు. తానుగా అతడే ఉన్నాడని తెలుస్తుంది. ఎప్పుడూ స్పందనగా పనిచేస్తున్నటువంటి దైవముతో సూటిగా ముడిపడడము భాగవత మార్గము. హంస స్వరూపుడైన భగవంతునితో తాను యోగము చెంది, అతడే తానుగా నుండు స్థితి కలిగినటువంటి వానిద్వారా భాగవత కథలు రసవత్తరంగా బయటకు వస్తాయి.

## 96

"పరమ భాగవత మూర్తులను భగవంతుని మూర్తులుగా భజించుట వలన సంసార బంధములందు ఏమరుపాటు కలుగును. సంసార బంధమును ఇట్లు దాటవలెనే గాని కోరి దాటుట సాధ్యము కాని పని." ఒక నిర్ణీత సమయము పెట్టుకొని, భక్తుల కథలు చదువుకోవాలి. మహాత్ముల భాషణలో అంతా భగవత్ తత్త్వమే ప్రకటింపబడుతుంది. ఈ మత్తులో మనముంటే ఇది మనకు వృద్ధి కలిగించి, మనల్ని అమృతత్వము లోనికి తీసుకొని వెడుతుంది.

## 97

సద్గురువు సర్వవ్యాపకమైన ప్రజ్ఞతో అనుస్యూతముగా అనుసంధానము చెంది ఉండి మనము గూడ ఆ మార్గము పొందడానికి దీక్షాబద్ధుడై ఉంటాడు. సదాచారము, సద్భక్తి, ఉన్ముఖత్వము ఉన్న శిష్యులకు అందుబాటులో ఉండి వారికి శారీరక, వాచిక, మనోశిక్షణల నిచ్చి ప్రవేశము కల్పిస్తాడు. కొంతకాలము పరిశీలించి 'పరము'నకు సంబంధించిన విషయములు ప్రధానము అనుకున్న వాడిని ఎంచుకొని అనుగ్రహిస్తాడు. అలాంటి సద్గురువుకు ఎంత పూజ చేసినా తక్కువే. ఏ రూపమున గురుతత్త్వము మనలను స్పృశించుచున్నదో ఆ రూపమును పూజించుట వినయ విధేయతలకు ప్రమాణము.

## 98

అంతర్యామి సాధనయే భాగవత మార్గము. అంతర్యామితో ముడిపడిన వారు సద్గురువులు. వారి నుంచి అంతర్యామియే పనిచేస్తూ ఉంటుంది. వారు అంతర్యామి తత్త్వానికి వాహికలు అవుతారు. అలాంటి వాహికల నుండి ఇతరులకు అంతర్యామి స్పర్శ అందుతూ ఉంటుంది. అంతర్యామిని దర్శించే వారికి కొన్నిటియందు విముఖత, కొన్నిటియందు సుముఖత ఉండదు. చెడ్డవారు అని అనుకొనే వారియందు గూడ వారు అంతర్యామిని దర్శిస్తారు. వాళ్ళ కథలు భాగవతములో యిచ్చారు. వాళ్ళకు కథానాయకుడు శ్రీకృష్ణుడు.

# 99

భాగవతములో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే భగవత్ తత్వాన్ని మాటిమాటికి రుచి చూపించేటటువంటి రహస్యాలు, ఉపాయాలు భాగవతములో ఉన్నాయి. ఒకే సత్యాన్ని రకరకాలుగా రుచిగా అందించడమే భాగవతము యొక్క ముఖ్యమైన ప్రయోజనం. వాటిని మనము అందుకొని ఒక దీక్షగా సాధన చేసుకుంటే మనకు దైవదర్శనము గాని, ఆత్మదర్శనము గాని జరిగేటటువంటి అవకాశము ఏర్పడుతుంది. బ్రహ్మవిద్యా సాధనకు కావలసిన సామాగ్రి అంతయూ భాగవతములో చెప్పబడినది. ఈ సాధన చేయుచు కృష్ణుని లీలలు కీర్తించుకొనినచో ఆత్మ ప్రసన్నమై భక్తియోగము అబ్బుతుంది. కృష్ణుని స్మరణలో ఒక విచిత్రమున్నది. మనకు తెలియకుండానే మన మనసు తేలిక పడేటటువంటి స్పర్శ ఉన్నది.

# 100

భాగవతము 'అన్నిటికీ దైవస్మరణే ఉపాయము' అని చెపుతుంది. మనిషిని దుఃఖములు ఎట్లా ముంచుతాయో, సుఖములు కూడ అలాగే మనిషిని ముంచేస్తాయి. సుఖ దుఃఖముల యందు మనసు పెట్టక, దైవస్మరణ యందు చిత్తము రగులుకొని ఉండేటట్లుగా, తగులుకొని ఉండేటట్లుగా, విడదీసినా విడబడకుండా ఉండేటట్లుగా ప్రయత్నము చేయాలి. దానికి కావలిసినది భాగవత మూర్తుల యొక్క సాన్నిధ్యము. మనకి వారియొక్క నిత్యస్మరణ అనేది జీవితమంతా ఉండడము వలన వారి నుంచి మనకు అంటు కట్టినట్లుగా ఏర్పడుతుంది. అందుచేత సద్గురు సమాశ్రయము, సహవాసము, వారితో కూడియుండుట, వారికి శుశ్రూష చేయుట చేయవలెను.

స్వస్తి!

# DHANISHTA PUBLICATIONS

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Aswini Devatalu | T |
| 13. | Ashram Regulation for Entry | E/G/S |
| 14. | An insight into the WTT | E |
| 15. | Atmasadhana Sutramulu | T |
| 16. | Avathara of Synthesis | E |
| 17. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 18. | Bharatiya Sampradayamu | T/K/Hi |

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.

19. Book of Prayers E
20. Bhagavathamurthy Bheeshmudu T
21. Bhagavatha Sukthamu - 1 T
22. Bhagavatha Sukthamu - 2 T
23. Bricks for the Temple E
24. Cow K/T/E/Hi
25. C.V.V. - Mastaru Yogamu - Sadhana Sutramulu T
26. Devapi Maharshi Bodhalu 1 & 2 T/E/K/Hi
27. Dharmavigrahudu - Sri Ramudu T
28. Dhanakamuni Katha T
29. Doctrine of Eternal Presence E
30. From the Teachers Pen E
31. Gayatri Mantra Avagahana T
32. Geetopanishad - Sankya Yogamu T
33. Geetopanishad - Karma Yogamu T
34. Geetopanishad - Gnana Yogamu T
35. Geetopanishad - Karma Sanyasa Yogamu T
36. Geetopanishad - Dhyana Yogamu T
37. Geetopanishad - Vijnana Yogamu T
38. Geetopanishad - Akshra Parabrahma Yogamu T
39. Geetopanishad - Rajavidya Rajaguhya Yogamu T
40 Geetopanishad - Vibhuthi Yogamu T
41. Good Friday E/S
42. Gurusisya Samvadamu T
43. Healers Handbook E
44. Health & Harmony E/G
45. Health & Harmony-2 E

| | | |
|---|---|---|
| 46. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 47. | Himalaya Guruparampara | T/Hi/K |
| 48. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 49. | Just Adjust | E |
| 50. | Jyotirlinga Yatra | T |
| 51 | Jyothisha Vignanamu | T |
| 52. | Kapila and Kardama | E/G/S |
| 53. | Katha Deepika | T |
| 54. | Kumara Sambavam | T |
| 55. | Lectures on Secret Doctrine - I | S/E |
| 56. | Lectures on Secret Doctrine - II | E |
| 57. | Lectures on Secret Doctrine - III | E |
| 58. | Listening to the Invisible Master | E/S/K |
| 59. | Lord Maitreya - The World Teacher | E/S |
| 60. | Life and Teachings of Master Jupiter | E |
| 61. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 62. | Mana Master garu | T |
| 63. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 64. | Mars - The Kumara | E/G/S |
| 65. | Mercury - The Alchemist | E/G/S |
| 66. | Maria Magdalena | E/S |
| 67. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 68. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 69. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 70. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 71. | MASTER C.V.V. - Yogamu | T |
| 72. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |

| | | |
|---|---|---|
| 73. | Master K. Parvathi Kumar - Short Biography | E |
| 74. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 75. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 76. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 77. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 78. | Marana Rahasyam-1 (Markandeya) | T |
| 79. | Marana Rahasyam-2 (Sathi Savitri Devi) | T |
| 80. | Marana Rahasyam-3 (Nachiketudu) | T |
| 81. | Master CSG | E |
| 82. | Messages of Master E.K. | E |
| 83. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 84. | Moon - The Key | E |
| 85. | New Age Hospital Management | E |
| 86. | Nutrients For Discipleship | E |
| 87. | OM | T/K/E |
| 88. | Occult Meditations | E/G/S |
| 89. | Om Namo Narayanaya | E/G/S |
| 90. | On Change | E/S |
| 91. | On Healing | E |
| 92. | On Love | E/G/S |
| 93. | On Service | E/G/S |
| 94. | On Silence | E/G/S |
| 95. | PARIKSHIT-The World Disciple | E |
| 96. | Pranayamam | T |
| 97. | Prayers | E/G/S |
| 98. | RUDRA | E |
| 99. | Rukmini Kalyanam | T |


| | | |
|---|---|---|
| 100. | Sai Sukthulu | T/K |
| 101. | Sai Ki Amruthavani | Hi |
| 102. | Sanghaneethi | T |
| 103. | SAM | E |
| 104. | Saraswathi-The Word | E/G/S |
| 105. | SANKHYA - The Sacred Doctrine | E/S |
| 106. | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 107. | Shodosopachara Pooja - Avagahana | T |
| 108. | SOUND-The Key and its Application | E/G/S |
| 109. | Spiritualism-Business and Management | E/G |
| 110. | Spiritual Healing | S/G |
| 111. | Sri Dattatreya | E/G/S/T |
| 112 | Sripada Srivallabha Charitamrutam | E |
| 113. | Srimadramayana Dharmakusumalu | T |
| 114. | Sri Guru Paadukastavamu | T |
| 115. | SRI LALITHA (Set 10 Books)<br>(Comentary on Sri Lalitha Sahasranamam) | T |
| 116. | SRI SASTRY GARU | T/K/E/S |
| 117. | Sri Krishna Namamrutham | T |
| 118. | Sri Shirdi Sai Sayings | E/G/S |
| 119. | Sri Suktam | E |
| 120. | Steps of Silence | E |
| 121. | Sun that Iam | E/G/S |
| 122. | Temple and the Work | E |
| 123. | Teachings of Lord Maitreya-1 | E |
| 124. | Teachings of Lord Maitreya-2 | E |
| 125. | The Aquarian Cross | E/G/S |


| | | |
|---|---|---|
| 126. | The Aquarian Master | E/G/S |
| 127. | The Doctrine of Ethics | E/S |
| 128. | The Etheric Body | E/G/K |
| 129. | The Golden Stairs | E/S |
| 130. | The Path of Synthesis | E |
| 131. | The Splendor of Seven Hills | E |
| 132. | Thus Spoke-Master Dhwhal Khul | E |
| 133. | THE TEACHER-Meaning and Significance | E |
| 134. | Teachings of Master Koot Hoomi 1 & 2 | E |
| 135. | The Teachings of Lord Kapila | E/G |
| 136. | The Teachings of Master Mourya 1 & 2 | E |
| 137. | The Teachings of Sanath Kumara | E/G/S |
| 138. | The Theosophical Movement | E/G/S |
| 139. | The White Lotus | T/E/S/K |
| 140. | The World Teacher | E |
| 141. | The Mysteries of Sagittarius | E |
| 142. | Time - The Key | E/G |
| 143. | Uranus- The Alchemist of the Age | E/G/S |
| 144. | Varuna Graha Prabhavamu | T/K |
| 145. | VENUS-The Path to Immortality | E/S |
| 146. | Violet Flame Invocations | E |
| 147. | Vrutrasura Rahasyam | T |
| 148. | Wisdom Buds | E/S |
| 149. | Wisdom Teachings of Vidura | E/G/S |
| 150. | Yama Geetha | T |

**Please visit our website**

(www.dhanishta.org / info@dhanishta.org) for prices


# ధనిష్ఠ ప్రచురణలు














ప్రతులకు : ధనిష్ఠ ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531
www.dhanishta.org info@dhanishta.org



భగవంతుడు అనుగ్రహించ దలచుకుంటే ఎవరినైనా అనుగ్రహిస్తాడు. ఎవరిని అనుగ్రహిస్తాడు, ఎవరిని అనుగ్రహించడు అనేది ఎవరూ చెప్పలేరు. జీవుడిలో మనము చూడలేనిది, అతడు చూడగలిగేదీ ఒకటి ఉంటుంది. పదిమంది కొరకు పాటుపడే దివ్యగుణము కలిగిన వారంటే ఆయనకు చాలా ఇష్టము. నీ చుట్టూ ఉన్న జీవరాసుల ఎడల నీవు ఎలా ఉన్నావు అన్నదానిని బట్టి ఆయన అనుగ్రహము ఉంటుంది. జీవుల హితము నందు ఆసక్తి నీ యందు సహజముగా ఉంటే, ఆయన కరుణ నీయందు తప్పక వర్షిస్తుంది. భగవదనుగ్రహము ఒక విచిత్రమైన విషయము. అది ఒక మహా వైభవం.

ధనిష్ఠ

ISBN 978-81-89467-98-2